మంగళవారం
03-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 103
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

షట్‌డౌన్ దిశగా అమెరికా

అమెరికాలో ప్రభుత్వ కార్యకలాపాల స్తంభించనున్నాయా? షట్‌డౌన్ జరగబోతోందా? వంటి ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను ఫెడరల్ ప్రభుత్వ ఫండింగ్ కాలం చెల్లిపోయింది. కానీ చివరి నిమిషంలో 45 రోజుల స్టాప్‌గ్యాప్ ఫండింగ్ బిల్లుపై దేశాధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేశారు.

2 లో

63% బీసీలే...



బీహార్‌లో ముగిసిన కులగణన

- ఎస్సీలు 19.65 శాతం, ఈబీసీలు 36 శాతం
- ఎస్టీలు 1.68 శాతం, ముస్లింలు 17.70 శాతం
- వివరాలు వెల్లడించిన ప్రభుత్వం

పాట్నా : బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కులాల సర్వే ఫలితాలను సోమవారం విడుదల చేసింది. రాష్ట్ర మొత్తం జనాభాలో ఓబీసీలు, ఈబీసీలు అత్యధికంగా 63 శాతం ఉన్నారని వెల్లడించింది. ఈ నివేదికను రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ వివేక్ సింగ్ ఇక్కడ విడుదల చేశారు. ఆ వివరాల ప్రకారం, రాష్ట్ర మొత్తం జనాభా 13.07 కోట్ల కంటే కొంచెం ఎక్కువగా ఉంది. అందులో అత్యంత వెనుకబడిన తరగతులు (36 శాతం) అతిపెద్ద సామాజిక విభాగం కాగా, ఇతర వెనుకబడిన తరగతులు 27.13 శాతంగా ఉన్నారు. కులాల వారీగా చూస్తే ఓబీసీ వర్గానికి చెందిన యాదవులు జనాభా పరంగా అత్యధికంగా ఉన్నారని నివేదిక తెలిపింది. వీరు మొత్తం జనాభాలో 14.27 శాతం. ఇక రాష్ట్రంలోని మొత్తం జనాభాలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) జనాభా 19.65 శాతం కాగా, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) జనాభా దాదాపు 22 లక్షలు (1.68 శాతం) గా

- మిగతా 2 లో

కులగణన చారిత్రకం

మద్దతిచ్చిన పార్టీలను కలిసి వివరాలిస్తాం: నితీశ్

2 లో

తమ రాష్ట్రంలో కులగణన జరిపి ఫలితాలు విడుదల చేయడం చారిత్రకమని జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నారు. గాంధీ జయంతి, కులగణన వివరాల వెల్లడి ఒకే రోజు జరగడం కలిసి వచ్చిందన్నారు.

కులం పేరిట దేశాన్ని విభజించారు

బీహార్ కులగణన ఫలితాలపై మోదీ

కులం పేరిట దేశాన్ని విభజించారని బీహార్‌లోని నితీశ్ ప్రభుత్వం కులగణన నిర్వహించి ఫలితాలను విడుదల చేసిన క్రమంలో ప్రధాని మోదీ విమర్శించారు.

2 లో



తెలుగు రాష్ట్రాల్లో

ఎన్ఐఏ సోదాలు

దాదాపు 60 ప్రాంతాల్లో పౌరహక్కుల నేతల ఇళ్లల్లో తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అకస్మిక సోదాలు విస్తృతంగా చేపట్టారు. ఏపీ, తెలంగాణలోని పౌరహక్కుల నేతలు, మావోయిస్టు సంఘాలతో సంబంధం కల్గి కేసులున్న వ్యక్తుల ఇళ్లు లక్ష్యంగా రెండు రాష్ట్రాల్లోని 60 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోమవారం తెల్లవారుజాము నుంచే దాడులు ప్రారంభించింది. విజయవాడ నగర శివార్లలోని పి.నైనవరం గ్రామంలో చైతన్య మహిళా సంఘం నాయకులు రాధ ఇంట్లో, చిట్టినగర్‌లోని న్యాయవాది అరసవిల్లి కృష్ణ, పూర్ణనందంపేటలోని న్యాయవాది ఆంజనేయులు నివాసాల్లో సోదాలు జరిగాయి. నోటీసులు ఇచ్చి, అవసరమైతే అరెస్ట్ చేస్తామని ఎన్ఐఏ చెప్పినట్లు తెలిసింది. నెల్లూరులోని ఉస్మాన్ సాహెబ్‌పేటలో ఎల్లంకి వెంకటేశ్వర్లు, తిరుపతిలో క్రాంతి చైతన్య, గుంటూరులో డాక్టర్ రాజారావు ఇళ్లలోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కావలి బాలయ్య ఇంటిలో సోదాలు జరిపారు. బాలయ్య కుమార్తె పద్మ, అల్లుడు శేఖర్ గతంలో బాంబు పేలుళ్ల కేసులో నిందితులు. గుంటూరు జిల్లా కొండపాటూరులో తమలపాకుల సుబ్బారావు, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు దుడ్డు వెంకట్రావు, సంతమాగులూరులో ఓర్సు శ్రీనివాసరావు, రాజమహేంద్రవరంలోని బొమ్మేరులో పౌరహక్కుల నేత నాజర్, హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి కోనాల లాజర్, శ్రీకాకుళంలో మిస్కా కృష్ణయ్య ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. కృష్ణయ్య ఆమదాలవలస మండలం తోటవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అనంతపురములో ఉపాధ్యాయుడు శ్రీరాములు ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో ప్రజా వైద్యశాల నిర్వహిస్తున్న పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజారావు, నెల్లూరు జిల్లాలో పౌర హక్కుల సంఘం నాయకుడు ఎల్లంకి వెంకటేశ్వర్లు నివాసాల్లో ఎన్ఐఏ బృందాలు సోదాలు చేపట్టాయి. నెల్లూరులో పౌర హక్కుల సంఘం నాయకులు అరుణ నివాసంలో తనిఖీలు జరిపారు. రెండు దశాబ్దాలుగా అణగారినవర్గాల పక్షానకు నిలబడి పౌర హక్కుల ఉద్యమంలో ఎల్లంకి వెంకటేశ్వర్లు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములుగా వామపక్ష పార్టీలతో కలిసి పనిచేస్తూ పౌర హక్కుల ప్రజలను నిరంతరం చైతన్యపరుస్తూ చురుగ్గా ఉంటారు. ప్రజా గొంతుకు వినిపించడంలో హక్కుల గురించి మాట్లాడడంలో ముందుంటారు. వెంకటేశ్వర్లుపై కొంతకాలంగా ఎన్ఐఏ నిఘా పెట్టింది. అలాగే విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో ప్రజానాట్యమండలి గాయకులు తూముల సింహాచలం ఇంట్లో తనిఖీ చేసి కొన్ని

- మిగతా 2 లో

'సత్యమేవ జయతే' పేరుతో

టీడీపీ దీక్షలు

రాజమండ్రి జైలులో చంద్రబాబు, బయట భువనేశ్వరి

ఢిల్లీలో నారా లోకేశ్, మంగళగిరిలో అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ నేతలు 'సత్యమేవ జయతే' పేరుతో సోమవారం నిరాహార దీక్షలు చేపట్టారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అన్యాయంగా అరెస్ట్ చేశారని, ఇందుకు నిరసనగా గాంధీ జయంతినాడు సత్యాగ్రహ దీక్ష చేపట్టాలని తెలుగుదేశం పార్టీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే సత్యమేవ జయతే దీక్షను ప్రారంభించారు. అలాగే చంద్రబాబును అరెస్ట్ చేసిన దగ్గర నుంచి రాజమహేంద్రవరంలోనే ఉంటున్న ఆయన సతీమణి భువనేశ్వరి వేలాది మంది మహిళల సమక్షంలో దీక్ష చేపట్టారు. ప్రస్తుతం ఈ కేసు విషయమై న్యాయకోవిదులతో చర్చించేందుకు ఢిల్లీలో ఉంటున్న ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద దీక్షకు కూర్చున్నారు. గాంధీ జయంతి సందర్భంగా తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ దీక్షలో టీడీపీ ఎంపీలు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేశినేని నాని, వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ముఖ్యనేతలు దీక్షలో కూర్చున్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్

- మిగతా 2 లో

ఎవరు అమ్ముడుపోయారో

తేల్చుకుందాం

- వైసీపీకి సీపీఐ సవాల్
- బీజేపీ అండతోనే జగన్ అరాచక పాలన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- టీడీపీ దీక్షలకు సంఘీభావం

2 లో

వైద్యశాస్త్రంలో

ఇద్దరికి నోబెల్

- ఎంఆర్‌ఎన్‌ఏ వాక్సిన్లపై పరిశోధలకు వరించిన ప్రతిష్టాత్మక పురస్కారం
- పెరిగిన నగదు బహుమతి
- డిసెంబరులో అవార్డుల ప్రదానం

స్టాక్‌హోమ్: ప్రపంచ దేశాలను గడగడలాడించిన కోవిడ్–19 మహమ్మారి అంతానికి ఎంఆర్‌ఎన్ఏ వాక్సిన్లు తయారీకి జరిపిన పరిశోధనలకుగాను ఇద్దరు శాస్త్రవేత్తలను ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం వరించింది. వైద్య రంగంలో విశేష కృషి చేసిన హంగేరి–అమెరికన్ కాటలిన్ కరికో, అమెరికాకు చెందిన డ్రూ వెస్‌మన్ నోబెల్ పురస్కారం–2023 కోసం ఎంపికయ్యారు. ఈమేరకు నోబెల్ కమిటీ సోమవారం ప్రకటించింది. భవిష్యత్‌లో మరిన్ని మందులను అభివృద్ధి చేసేందుకు ఈ ఇద్దరు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



హమ్మయ్యా... అందరూ తప్పనిసరిగా ఓటువేస్తే మనపని అంతే!



మాజీ మంత్రి బండారు అరెస్ట్

- ఆదివారం రాత్రే టీడీపీ నేత ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు
- బాసటగా నిలిచిన పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు
- బండారు స్వగ్రామం వెన్నెలపాలెంలో ఉద్రిక్తత
- ఎట్టకేలకు సోమవారం రాత్రి అదుపులోకి

2 లో

'స్వచ్ఛతార్భాటం'

తొమ్మిదేళ్లలో మెరుగవ్వని పారిశుద్ధ్యం

- అధ్వాన్నంగా పబ్లిక్ టాయిలెట్లు
- లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో పారిశుద్ధ్యం లోపించిందని, సులభ్ కాంపెక్స్ వాడలేమని పట్టణ ప్రజలు అంటున్నారు. పబ్లిక్ టాయిలెట్ల పరిస్థితి దారుణమని, వాటి నిర్వహణ అద్వాన్నమని వెల్లడించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ 'స్వచ్ఛ భారత్' ఆర్భాటం అంతా ఇంతా కాదు. స్వచ్ఛతా పేరిట ప్రకటనలు, ప్రచారాలతో రచ్చ చేస్తుంటుంది. చీపురు పట్టి రోడ్లు ఊడ్చే ఫొటోలు, వీడియోలతో ప్రధాని మోదీ సహా ఆయన అనుచరగణం హడావిడి చేస్తుంటారు. దేశం కోసం తామంతా శ్రమిస్తున్నట్లు చూపేందుకు యత్నిస్తారు. వాస్తవానికి స్వచ్ఛతా మిషన్ కేవలం ప్రచార్భాటానికి

- మిగతా 2 లో

'మహా' విషాదం

నాందేడ్‌ఆస్పత్రిలో ఒకేరోజు 24 మంది మృతి

అందులో 12 మంది నవజాత శిశువులు

నాందేడ్: మహారాష్ట్రలోని ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో మహావిషాదం చోటుచేసుకుంది. థాణే ప్రభుత్వ ఆస్పత్రి దుర్ఘటన మరువక ముందే తాజాగా నాందేడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకేరోజు 24 మంది మృత్యువాతపడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వారిలో 12మంది నవజాత శిశువులు ఉండటం తీవ్ర విషాదం కలిగిస్తోంది. ఆస్పత్రిలో ఔషధాలు, సిబ్బంది కొరత వల్లే ఈ దారుణం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ఆగస్టులో థాణేలోని ప్రభుత్వాసుపత్రిలో ఒకేరోజు 18మంది రోగులు మృతిచెందిన ఘటన

- మిగతా 2 లో

షట్‌డౌన్ దిశగా అమెరికా

చివరి నిమిషంలో స్టాప్‌గ్యాప్ నిధి బిల్లుపై బైడెన్ సంతకం

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వ కార్యకలాపాల స్తంభించనున్నాయా? షట్‌డౌన్ జరగబోతోందా? వంటి ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను ఫెడరల్ ప్రభుత్వ ఫండింగ్ కాలం చెల్లిపోయింది. కానీ చివరి నిమిషంలో 45 రోజుల స్టాప్‌గ్యాప్ ఫండింగ్ బిల్లుపై దేశాధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేశారు. తద్వార ప్రభుత్వ షట్‌డౌన్ నివారణకు చివరి నిమిషంలో చర్యలు చర్చకు దారితీశాయి. వాషింగ్టన్ కాలమానం ప్రకారం శనివారం ఉదయం కొత్త బిల్లును సభాపతి కెవిన్ మెక్ కార్తీ విడుదల చేశారు. నవంబరు వరకు ఫెరడల్ సంస్థలకు నిధులు సమకూరేలా ఈ బిల్లు తెచ్చారు. అధ్యక్షుడు కోరినట్లు విపత్తు సాయంగా 16 బిలియన్ అమెరికన్ డాలర్ల నిధినీ ఇందుకు జోడించారు. కొత్త బిల్లులో ఖర్చులను భారీగా తగ్గించారు. కన్జర్వేటివ్ రిపబ్లికన్స్ కోరినట్లు సరిహద్దు భద్రతా వ్యయాన్ని కోతవేశారు. డెమొక్రాట్లు అడిగిన ఉక్రెయిన్‌కు అదనపు సాయాన్ని ఆమోదించలేదు. స్టాప్‌గ్యాప్ ఫండింగ్ బిల్లును ప్రవేశపెట్టగా ప్రతినిధుల సభ వెంటనే ఆమోదించింది. 335 అనుకూల, 91 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. కొన్ని గంటల్లోగా సెనేట్‌లోనూ దీనికి ఆమోదం లభించింది. 88-9 ఓట్లు వచ్చాయి. ఈ బిల్లును కాంగ్రెస్ ఆమోదించడం శుభ పరిణామని బైడెన్ అన్నారు. మనకు ఇలాంటి పరిస్థితి వచ్చి వుండాల్సింది కాదంటూ ఎక్స్ మాధ్యమంగా ఆందోళన వ్యక్తంచేశారు. ఇది సృష్టిత సంక్షోభమని అన్నారు. ఇందుకు రిపబ్లికన్లను నిందించారు. కొన్ని నెలల కిందట తాను, మెక్‌కార్తీ ప్రతిపాదించిన బడ్జెట్ ఒప్పందంపై చర్చను వారు బహిష్కరించారని గుర్తుచేశారు. ఉక్రెయిన్‌కు మరింత సాయాన్ని ఆమోదించాలని కూడా ఆయన సభను కోరారు. ఉక్రెయిన్ కోసం డెమొక్రాట్ల విజ్ఞప్తిని కన్జర్వేటివ్ రిపబ్లికన్లు తిరస్కరించారు.

జింబాబ్వేలో కూలిన ప్రైవేటు విమానం

భారత మైనింగ్ దిగ్గజం, కుమారుడు సహా ఆరుగురి దుర్మరణం

జొహెనెస్‌బర్గ్: జింబాబ్వేలో ఓ ప్రైవేటు విమానం కూలిపోయింది. ఇందులో ప్రయాణించిన భారత్ మైనింగ్ దిగ్గజం, ఆయన కుమారుడు దుర్మరణం చెందారు. మరో నలుగురు మరణించారు. జింబాబ్వేలోని డైమెండ్ గని సమీపంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు మీడియా తెలిపింది. మషావా, ఐహరారే ప్రాంతంలో విమానం కూలిందని పేర్కొంది. బంగారం, బొగ్గు ఉత్పత్తితో పాటు నికిల్, కాపర్ రిఫైనింగ్‌కు సంబంధించిన మైనింగ్ కంపెనీ 'రియో జిమ్' యజమాని హర్పాల్ రంధావా, ఆయన తనయుడు ఈ ప్రమాదంలో చనిపోయారు. రియోజిమ్‌కు చెందిన సెస్నా 206 విమానం హరారే నుంచి మురోవా డైమెంట్ గనికి వెళుతుండగా కూలిపోయినట్లు వార్తలు వచ్చాయి. క్రూ సహా ప్రయాణికులంతా మరణించినట్లు తెలిపాయి. అయితే మృతుల వివరాలను ప్రకటించలేదు. కాగా మైనింగ్ దిగ్గజం రంధావా మరణాన్ని ఆయనకు జర్నలిస్టు మిత్రుడు ఒకరు ధ్రువీకరించారు.

విశాలాంధ్ర ప్రపంచం

స్లోవేకియా పార్లమెంటు ఎన్నికలు

42 స్థానాల్లో వామపక్ష పార్టీ గెలుపు

సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు కసరత్తు

ప్రాగ్: స్లోవేకియా పార్లమెంటరీ ఎన్నికల్లో వామపక్ష పార్టీ సత్తా చాటింది. అతిపెద్ద పార్టీగా అవతరించింది. డైరెక్షన్ సోషల్ డెమొక్రసీ పార్టీని విజయపథంలో నడిపించిన మాజీ ప్రధాని రాబర్ట్ ఫికోకు ప్రజలు పట్టంకట్టారు. దీంతో ఆయన మరోమారు ప్రధానిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. అయితే ఈ పార్టీ రష్యాకు అనుకూలం, అమెరికాకు వ్యతిరేకం. ఇదే సందేశాన్ని ప్రచార సమయంలో ప్రజలకు అందింది. తాజా ఎన్నికల్లో 22.9శాతం ఓట్లతో అతిపెద్ద పార్టీగా డైరెక్షన్ సోషల్ డెమొక్రసీ నిలిచింది. పార్లమెంటులో 150 స్థానాలలో 42ను కైవసం చేసుకుంది. ప్రోగ్రెసివ్ స్లోవేకియా పార్టీ 18శాతం ఓట్లతో 32 స్థానాలను గెలుచుకుని రెండవస్థానంలో నిలవగా మాజీ ఉప ప్రధాని పీటర్ పెల్లగ్రిని నేతృత్వ హ్లాస్ (వాయిస్) పార్టీ 14.7శాతం ఓట్లతో మూడోస్థానంలో నిలిచింది. 27 స్థానాలను దక్కించుకుంది. ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. దీంతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. ఆనవాయితీ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజేతకు అధ్యక్షుడు ఆహ్వానిస్తారు. ఇదే క్రమంలో కలిసివచ్చే పార్టీలతో చర్చలకు తాను సిద్ధమేనని ఫికో వెల్లడించారు. 'మాకు అనుభవం, నేర్పు ఉన్నాయి. మేము సిద్ధంగా ఉన్నాం' అని ఆయన ప్రకటించారు. కాగా, ఫికో 2006-10లో, 2012-18లో ప్రధానిగా పనిచేశారు. అధ్యక్షుడు జుజానా కపుటోవా సోమవారం ఫికోను ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయమై ఆహ్వానించారని తెలిసింది.

వైద్యశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

శాస్త్రవేత్తలు తయారు చేసిన ఎఆర్ఎన్ఏ వాక్సిన్‌లు దోహదమవుతాయని తెలిపింది. మానవాళికి పెద్ద ముప్పుగా పరిణమించిన కోవిడ్ కోసం వాక్సిన్ తయారీకి ఈ శాస్త్రవేత్తలు విశేష కృషి చేసినట్లు వెలడించింది. పురస్కారాలను ప్రకటించే ముందు ఫోన్ ద్వారా ఇద్దరు శాస్త్రవేత్తలకు సమాచారం ఇవ్వగా వారు అమితానందాన్ని వ్యక్తంచేశారని నోబెల్ అసెంబ్లీ కార్యదర్శి థామస్ పెరల్‌మన్ అన్నారు. కటాలిన్ కరికో హంగేరిలోని సగన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాగా డ్రూ వెస్‌మెన్ పెనెల్వేనియా వర్సిటీ ప్రొఫెసర్. వీరిద్దరు కలిసి పెనెల్వేనియా యూనివర్సిటీలో నిర్వహించిన పరిశోధన ప్రతిష్ఠాత్మక అవార్డును తెచ్చిపెట్టింది. న్యూక్లియోసైడ్ బేస్ మాడిఫికేషన్లలో వీరు చేసిన ఆవిష్కరణలు కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన ఎంఆర్ఎన్ఏ వాక్సిన్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినందునే ఈ ఇద్దరి పేర్లను వైద్యశాస్త్రంలో నోబెల్ పురస్కారం కోసం ఎంపిక చేసినట్లు ప్రకటన తెలిపింది. ఎంఆర్ఎన్ఏ వాక్సిన్లు కణాల్లోకి పంపినప్పుడు అవి ప్రతిచర్యను అడ్డుకోవడంతో పాటు, శరీరంలో ప్రొటీన్ ఉత్పత్తిని పెంచుతాయి. తమ తమ పరిశోధన వివరాలను 2005లో వీరు ప్రచురించారు. వీరి పరిశోధనల ఆధారంగా 2020 చివర్లో రెండు ఆర్ఎన్ఏ వాక్సిన్లకు ఆమోదం లభించింది. ఆ వాక్సిన్లు కోవిడ్ వ్యాప్తిని కట్టడి చేశాయి. కోట్లాది మంది ప్రాణాలను కాపాడగలిగాయని నోబెల్ కమిటీ తెలిపింది. నోబెల్ పురస్కారం రూపేణ ఎప్పటిలా 10 మిలియన్ల స్వీడిష్ క్రోనర్ల నగదుకు బదులు ఈసారి 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్లు ఇవ్వనున్నారు. నగదు బహుమతిని పెంచినట్లు కమిటీ పేర్కొంది. స్వీడిష్ కరెన్సీ విలువ పడిపోతున్న నేపథ్యంలో ఈమేరకు నిర్ణయించినట్లు తెలిపింది. కాగా, మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య విభాగాల్లో పురస్కారాలను ప్రకటించనున్నారు. అలాగే శుక్రవారం నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటిస్తారు. ఈనెల 9న అర్థశాస్త్రంలో పురస్కార గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. ఈ ఏడాది డిసెంబరు 10న అవార్డులను ప్రదానం చేస్తారు. అయితే స్వీడన్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీద 1901 నుంచి ప్రతి సంవత్సరం ఈ అవార్డులు ప్రదానం చేస్తున్న విషయం విదితమే.

'మహా' విషాదం

(మొదటిపేజీ తరువాయి)

అప్పట్లో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. తాజాగా గడిచిన 24గంటల వ్యవధిలో మృతిచెందిన వారిలో ఆరుగురు మగ శిశువులు, ఆరుగురు ఆడ శిశువులు ఉన్నట్టు ఆస్పత్రి డీన్ శంకర్‌రావు చవాన్ తెలిపారు. మిగిలిన 12 మంది వివిధ వ్యాధులు, పాముకాటు కారణంగా మృతి చెందారని చెప్పారు. ఆస్పత్రిలో అనేక మంది సిబ్బందిని బదిలీ చేయడంతో రోగులకు సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. తాజా మరణాలపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. మూడు ఇంజిన్ల (బీజేపీ, ఏక్‌నాథ్ శిందే-శివసేన, ఎన్సీపీ- అజిత్ వర్గం) ప్రభుత్వమే ఈ మరణాలకు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మరణాలపై ఆస్పత్రి వైద్యుడు డా.శ్యామ్‌రావు వకోడే స్పందించారు. "ఒక్కరోజులో 12 మంది చిన్నారులు మృతి చెందారు. మరో 12 మంది వేర్వేరు కారణాలతో మరణించారు. ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు వచ్చాయి. రోగుల కోసం కేటాయించిన బడ్జెట్ సర్దుబాటు కాలేదు" అని చెప్పారు. ఈ ఘటనను ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే తీవ్రంగా ఖండించారు. ఈ మరణాలు ఖచ్చితంగా యాదృచ్ఛికం కాదన్న ఆమె.. వీటిపై సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. గతంలో థానేలో ప్రదర్శించిన అజాగ్రత్తే ఈసారి కూడా కనిపిస్తోందని విమర్శించారు. ఒకరి తప్పుల్ని మరొకరు కప్పిపుచ్చుకోనేందుకు దాగుడు మూతలు ఆడుతున్నారని ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. ఆస్పత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో మందులు అందడంలేదని రోగులు వాపోతున్నారని చెప్పారు. ఈ ఘటనపై శివసేన (యూబీటీ) నేత, మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

'స్వచ్ఛతార్భాటం'

(మొదటిపేజీ తరువాయి)

పరిమితమైనట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు సూచిస్తున్నాయి. తొమ్మిదేళ్లలో స్వచ్ఛ భారత్ మిషన్ వల్ల ఒరిగినదేమీ లేదని వెల్లడవుతోంది. ముంబై, దిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో పారిశుద్ధ్యంపై సర్వేను లోకల్ సైకిల్స్ సోషల్ మీడియా సంస్థ నిర్వహించగా పబ్లిక్ టాయిలెట్లు అధ్వాన్న స్థితిలో ఉంటాయన్న ప్రజాభిప్రాయం వ్యక్తమైంది. మూడేళ్లుగా తమ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం క్షీణించిందని, పబ్లిక్ టాయిలెట్లు కంపు కొడుతుంటాయని చాలామంది చెప్పినట్లు సర్వే తెలిపింది. తొమ్మిదేళ్లలో పబ్లిక్ టాయిలెట్ల స్థితిలో మార్పేలేదన్నది ప్రజాభిప్రాయంగా ఈ సర్వే నివేదిక వెల్లడించింది. అత్యవసరమైతే కమర్షియల్ కాంప్లెక్స్‌లకు వెళతామేగానీ పబ్లిక్ టాయిలెట్లు వాడబోమని పట్టణ ప్రజలు చెప్పారని తెలిపింది. సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లడం కంటే భయానకం మరేమీ ఉండదని వారన్నట్లు పేర్కొంది.

సులభ్ ఇంటర్నేషనల్ వంటి ప్రముఖ సంస్థ అధ్వర్యంలో నడిచేవి మాత్రం పర్వాలేదనిపించినట్లు వెల్లడించింది. దేశంలోని మొత్తం 341 జిల్లాలో జరిపిన ఈ సర్వేలో 39వేల మంది పాల్గొన్నారు. పబ్లిక్ టాయిలెట్లు అందుబాటులో ఉంటాయని 42శాతం మంది చెప్పగా అవి అధ్వాన్నంగా ఉంటాయని 52శాతం మంది, పర్వాలేదని 37శాతం మంది, నామమాత్రంగా పనిచేస్తాయని 25శాతం మంది, పనిచేయవని 12శాతం మంది చెప్పారని సర్వే వెల్లడించింది. అత్యవసరమైతే డబ్బులు చెల్లించే టాయిలెట్లు వాడతామేగానీ మున్సిపల్ టాయిలెట్లు వాడమని ప్రధాన నగరాల్లోని 68శాతం మంది చెప్పినట్లు తెలిపింది. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ బాగుంటుందని కేవలం 10శాతం మంది చెప్పగా అధ్వాన్నంగా ఉంటాయని 53శాతం చెప్పినట్లు సర్వేలో వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న వారిలో 69శాతం మంది పురుషులు కాగా 31 మంది మహిళలు ఉన్నారు. వీరిలో టైర్ వన్ జిల్లాల నుంచి 47శాతం మంది ఉంటే 31శాతం (టైర్ 2), 22శాతం మంది టైర్ 3, 4 జిల్లాల వారున్నారు.

ఎవరు అమ్ముడుపోయారో తేల్చుకుందాం

విశాలాంధ్ర-విజయవాడ/గుంటూరు: పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రి, మరో 14ఏళ్లు ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయటం అనేక కేసుల్లో నిందితుడుగా ఉండి బెయిల్‌పై ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడి వల్ల కాదనీ, కేంద్రంలోని బీజేపీ పెద్దల అండదండలతోనే రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని వైసీపీ పాలనను వ్యతిరేకిస్తూ రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన నిరసన దీక్షకు సంఘీభావంగా విజయవాడ, గుంటూరులలో టీడీపీ నిర్వహించిన దీక్షలో రామకృష్ణ పాల్గొని సీపీఐ రాష్ట్ర సమితి తరుపున సంఘీభావం తెలిపారు. విజయవాడలోని కేశినేని భవన్ వద్ద సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రశ్నించినందుకు కమ్యూనిస్టులు చంద్రబాబుకు అమ్ముడుపోయారని వైసీపీ నాయకులు విరుచుకుపడడాన్ని తీవ్రస్థాయిలో ఖండించారు. వైసీపీకి దమ్మూ, ధైర్యం ఉంటే ఎవరు అమ్ముడుపోయారో తేల్చుకుందామని సవాల్ విసిరారు. రాజమహేంద్రవరంలో నారా భువనేశ్వరి చేస్తున్న నిరసన దీక్షలో సీపీఐ రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ, పెన్మెత్స దుర్గాభవాని పాల్గొని సంఘీభావం తెలిపేందుకు వెళ్లారని చెప్పారు. నారా లోకేశ్ దిల్లీలో కేంద్ర మంత్రులను కలిసేందుకు ప్రయత్నిస్తే హోంమంత్రి, ఇతర మంత్రులు ఒక్కరూ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. నలుగురు పార్లమెంటు సభ్యులు చేస్తున్న ప్రయత్నాలకు ఎందుకు స్పందించటం లేదని అనుమానం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారం, డబ్బు మదంతో సీఎం జగన్ పోలీసు రాజ్యాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. జైల్లో పెట్టిన తరువాత ఆధారాలు వెతుకున్నారన్నారు. చంద్రబాబు అరెస్టును రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు ఖండించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలకు ఆరు నెలల ముందు చంద్రబాబును అరెస్టు చేస్తే టీడీపీ సానుభూతి పెరుగుతుందనే ఆలోచన లేకుండా చేసినందుకు వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లన ప్రక్కన పెట్టి రాజకీయ నిరుద్యోగులైన సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోగంటి రామారావు, లింగమనేని శివరామప్రసాద్, వాసిరెడ్డి ప్రసాద్, వెంకట రమణ, పరిశపోగు రాజేష్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరు హిందూ ఫార్మసీ కళాశాల ఎదుట చేపట్టిన 36 గంటల ధర్మాగ్రహ దీక్ష శిబిరాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రితో కలిసి రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా దీక్షకు మద్దతు తెలుపుతూ, చంద్రబాబు నాయుడు అరెస్ట్ అంశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విజ్ఞత ప్రదర్శించాలన్నారు. రాష్ట్ర గవర్నర్‌కు తెలపకుండా కనీసం ఆధారాలు కూడా లేకుండా ఒక మాజీ ముఖ్యమంత్రిని జైలుకు పంపడం సరైంది కాదని అన్నారు. రాష్ట్రంలో సీఐడీ జగన్ ప్రైవేటు సైన్యంలా పనిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐడీ బదులు జేపీసీ అని పేరు పెట్టుకుంటే బాగుంటుందని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాన్ పొలిటికల్ జేఏసీ నాయకులు పీవీ మల్లిఖార్జునరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

భవన్‌లో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు దీక్షలో కూర్చున్నారు. ఎన్టీఆర్ కుమార్తె గారపాటి లోకేశ్వరి, తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డి, ఎన్టీఆర్ మనమడు గారపాటి శ్రీనివాస్, చలసాని చాముండేశ్వరీ, నందమూరి జయశ్రీ, నారా రోహిత్ తల్లి నారా ఇందిరా తదితరులు దీక్షలో కూర్చున్నారు. టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రజాధనంపై మాకు ఎప్పుడూ ఆశలేదు: నారా భువనేశ్వరి

నా తండ్రి, భర్త ఇద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేసినా తమ కుటుంబం ఎప్పుడూ ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. రాష్ట్రం, ప్రజల బాగు కోసమే చంద్రబాబు నిత్యం పరితపించేవారన్నారు. చంద్రబాబుకు మద్దతుగా ఆమె చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్ష ముగిసింది. రాజమహేంద్రవరంలో ఆమెకు నిమ్మరసం ఇచ్చి చిన్నారులు దీక్షను విరమింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దీక్షలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

దొంగకేసుల నుంచి న్యాయమే మమ్మల్ని కాపాడుతుంది: లోకేశ్

దొంగ కేసులనుంచి న్యాయస్థానాలు, చట్టాలే తమను కాపాడతాయని యువనేత నారా లోకేశ్ పేర్కొన్నారు. దిల్లీలో దీక్ష విరమణ అనంతరం లోకేశ్ విలేకరులతో మాట్లాడుతూ మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా నమ్మిన సిద్ధాంతం కోసం జైలుకెళ్లారని, చంద్రబాబు నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం స్కిల్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు తెచ్చినందుకే దొంగ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. ఏ తప్పూ చేయని చంద్రబాబును స్కిల్ డెవలప్ మెంట్ పేరుతో తప్పుడు కేసుపెట్టి 24 రోజులుగా జైలులో పెట్టారని, ఆధారాలు లేని కేసులో చంద్రబాబును జైలుకు పంపడమేగాక మరో 3 అక్రమ కేసులు రెడీ చేశారన్నారు. మంత్రులు రోజుకోసారి నాతోపాటు తన తల్లి భువనేశ్వరమ్మను, బ్రాహ్మణిని జైలుకు పంపుతామని అంటున్నారు. అయినా మేము తగ్గేదేలేదని, పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

స్కిల్ కేసులో అవినీతి రుజువైతే మేమే ఉరివేసుకుంటాం: అచ్చెన్నాయుడు

స్కిల్ కేసులో అవినీతి రుజువైతే తామే నడిరోడ్డుపై ఉరివేసుకోవటానికి సిద్ధంగా ఉన్నామని ఏపీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తమ అధినేత చంద్రబాబును అరెస్టు చేసి సీఎం జగన్ తన పీకను తానే కోసుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికలెప్పుడు జరిగినా తెలుగుదేశం - జనసేన పార్టీలు కలిసి 161 స్థానాలతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తెలుగుదేశం - జనసేన చేతులు కలిపాయని వెల్లడించారు. చంద్రబాబుకు మద్దతుగా శాంతియుతంగా గంట కొట్టిన వారిపై దుర్మార్గంగా కేసులు పెట్టారని మండిపడ్డారు. తప్పు చేసిన అధికారులు పాముల పుట్టలో దాక్కున్నా వదలబోమని హెచ్చరించారు.

రైతులకు భరోసా ఏది ?

కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-నంద్యాల: రైతులకు భరోసా ఇవ్వడంలో, వారిని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. 86 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 50లక్షల ఎకరాలు మాత్రమే జరుగుతోందన్నారు. మెట్ట ప్రాంతాల్లో వేసిన పంటలు వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, కంది, మిరప పంటల దిగుబడులు కూడా 50శాతం తగ్గాయన్నారు. ప్రభుత్వం కరువుకు ప్రత్యామ్నాయం చూపడంలో విఫలమైందని, రబీకి కావలసిన విత్తనాలు సకాలంలో అందించలేకపోయారని అన్నారు. యూరియా నిల్వలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వర్షాభావం కారణంగా పత్తి దిగుబడి తగ్గిందన్నారు. కేసి కింద పంట వేసిన రైతులకు నీళ్లు అందక నష్టపోతున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రబీ పంటలు వేసుకునే రైతులకు 90శాతం సబ్సిడీకి విత్తనాలు ఇవ్వాలన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని, ఒక్కో రైతు కుటుంబానికి రూ.2.45 లక్షల రుణముందన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చును బేరీజు వేసి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు తిరిగివ్వాలన్నారు. తెలంగాణ ఎన్నికల దృష్ట్యా ప్రధాని మోదీ పసుపు బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, గతంలోనూ ఎన్నికలప్పుడు ఇదే హామీ ఇచ్చారు కానీ నేటికీ అమలు చేయలేదన్నారు. నిస్సిగ్గుగా మరోమారు తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు ఆయన సిద్ధపడ్డారని విమర్శించారు. కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని రాష్ట్రాల గవర్నర్ల కార్యాలయం ముందు నవంబరు 26, 27, 28 తేదీల్లో ఆందోళనలకు పిలుపునిచ్చారు.

63% బీసీలే

(మొదటిపేజీ తరువాయి)

నమోదయింది. జనరల్ కేటగిరీకి చెందిన వారు మొత్తం జనాభాలో 15.52 శాతం ఉన్నారు. మొత్తం జనాభాలో 81.99 శాతం మంది మెజారిటీ సామాజిక వర్గంతో, ముస్లింలు (17.70 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నందున, రాష్ట్ర జనాభాలో అత్యధికంగా హిందువులు ఉన్నారని నివేదిక నిర్ధారించింది. ఇక క్రైస్తవులు, సిక్కులు, జైనులు, ఇతర మతాలను అనుసరించే వారు, అవిశ్వాసులు కూడా మొత్తం జనాభాలో ఒక శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఉన్నారు. ఈ భారీ కసరత్తు చేపట్టిన ప్రభుత్వ అధికారుల బృందాలను ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అభినందిస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర శాసనసభలో ఎన్నికల ఉనికిని కలిగి ఉన్న మొత్తం తొమ్మిది రాజకీయ పార్టీల సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేసి వాస్తవాలు, గణాంకాలను వారితో పంచుకుంటామని కూడా ఆయన చెప్పారు. నితీశ్ కుమార్ మిత్రుడు, తన డిప్యూటీ తేజస్వి యాదవ్ తండ్రి అయిన ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ కూడా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కసరత్తు 'దేశవ్యాప్త కుల గణనకు మార్గం సుగమం చేస్తుంది. ఇది మేము కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు చేపట్టడం జరుగుతుంది' అని తెలిపారు. 'ఇండియా కూటమి' ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన లాలూ ప్రసాద్, నితీశ్ కుమార్ ఇటీవల బెంగళూరులో జరిగిన ఒక సమావేశంలో కుల గణనను నిర్వహించడానికి తన నిబద్ధతను ధ్రువీకరించారు. జనాభా గణనలో భాగంగా ఎస్సీ, ఎస్టీలు మినహా ఇతర కులాల లెక్కింపును చేపట్టడం కుదరదని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం స్పష్టం చేయడంతో గత ఏడాది సర్వేకు ఆదేశించడం గమనార్హం. చివరిసారిగా 1931లో అన్ని కులాల గణనను చేపట్టారు. కాగా, తాజా కులాల సర్వే కోసం పిలుపునిచ్చే వారు ప్రధానంగా సమాజంలోని బలహీన వర్గాలకు, స్వాతంత్ర్యానంతర కాలంలో మెరుగైన ఆయుర్దాయంతో, జనాభాలో వారి నిష్పత్తిలో పెరుగుదల కనిపించిన వారికి కొత్త అంచనా అవసరమని నొక్కి చెప్పారు. గత ఏడాది జూన్ 2న కులాల సర్వే నిర్వహించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపి, రూ.500 కోట్లు కేటాయించింది. ఈ కసరత్తును సవాలు చేస్తూ దాఖలైన అనేక పిటిషన్లను విచారిస్తున్న పాట్నా హైకోర్టు స్టే విధించడంతో సర్వే క్లుప్తంగా కఠినమైన వాతావరణంలో నడిచింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న మహాఘట్‌బంధన్‌కు చెందిన నాయకులు పిటిషన్లు దాఖలు చేస్తున్న వారు 'బీజేపీ మద్దతుదారులు' అని ఆరోపించారు. ఈ ఏడాది జనవరిలో కులాలవారీగా జనాభా లెక్కల సేకరణ ప్రారంభమయింది. రాష్ట్రంలోని 38 జిల్లాల్లో రెండు దశల్లో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే కులగణనను వ్యతిరేకిస్తూ పాట్నా హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. న్యాయస్థానం వాటిని కొట్టివేస్తూ సర్వేకు అనుమతించింది. దీంతో ఈ విషయం సుప్రీం కోర్టుకు వెళ్లింది. ప్రస్తుతం ఈ అంశం దేశ అత్యున్నత న్యాయస్థానం పరిధిలో ఉంది.

మాజీ మంత్రి బండారు అరెస్ట్

విశాలాంధ్ర-పరవాడ : తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజాపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఇటీవల బండారు అభ్యంతకర వ్యాఖ్యలు చేశారని గుంటూరు అర్బన్ పరిధిలో అనేక పోలీసు కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు బండారును సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అయితే ఆదివారం రాత్రి పదిన్నర గంటలకు పోలీసులు బండారు ఇంటిని చుట్టుముట్టడంతో ఆయన స్వగ్రామం వెన్నెలపాలెంలో ఒక్క సారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి నుంచి సోమవారం రాత్రి వరకూ ఉత్కంఠ వాతావరణం సాగింది. కాగా తనను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో తెలపాలని బండారు కోరడంతో వివరాలు ఇచ్చేందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్ట్ చేస్తారని పోలీసులను ఆయన నిలదీశారు. పోలీసుల తీరును నిరసిస్తూ బండారు ఇంట్లోనే తలుపులు వేసుకుని ఉండిపోయారు. ఈ సందర్భంగా బండారు ఇంటి వద్ద భారీగా పోలీసులను మోహరించారు. దీంతో బండారును ఏ క్షణాన్నైనా అరెస్ట్ చేస్తారన్న సమాచారం ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా సాగడంతో టీడీపీ శ్రేణులు భారీగా బండారు ఇంటి వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, గండి బాబ్జి, పీలా గోవింద్, కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, నాయకులు బుద్దా నాగజగదీష్, పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, జనసేన నాయకులు సుందరపు విజయ కుమార్ తదితరులు బండారుకు బాసటగా నిలిచారు. సాయంత్రం జిల్లా అదనపు ఎస్పీ విజయకుమార్ గుంటూరు పోలీసులతో కలిసి వెన్నెలపాలెం చేరుకున్నారు. బండారు ఎంతకీ బయటకు రాకపోవడంతో పోలీసులు తలుపులు పగల కొట్టే ప్రయత్నం చేశారు. ఇంతలో బండారు స్వయంగా తలుపులు తెరవడంతో ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ఎన్ఐఏ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

కరపత్రాలను, ప్రజా నాట్యమండలి పాటల పుస్తకాలను, ఆయన సెల్‌ఫోన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయానికి హాజరు కావాలని నోటీసులు జారీచేశారు. కొవ్వూరులోని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు,న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణపై ఇంటిపై ఆకస్మిక దాడి జరిపి ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సోదాలు చేపట్టారు. ఆయనకు 160 సీఆర్‌పీసీ చట్టం కింద నోటీసులిచ్చి ఈనెల 24వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్ఏఐ కార్యాలయంలో విచారణకు రావాలని ఆదేశించారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో భవాని, న్యాయవాది సురేశ్ ఇళ్లలో, వరంగల్‌లోని హంటర్ రోడ్డులో చైతన్య మహిళా మండలి సభ్యులు అనిత, శాంతమ్మ నివాసాల్లో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టారు. న్యాయవాది సురేశ్‌తో పాటు అతని బంధుమిత్రుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. ఎన్ఐఏ సోదాలను పౌరహక్కుల సంఘాలు, న్యాయవాదులు ఖండించారు.

'కులం పేరిట దేశాన్ని విభజించారు'

న్యూదిల్లీ: కులం పేరిట దేశాన్ని విభజించారని బీహార్‌లోని నితీశ్ ప్రభుత్వం కులగణన నిర్వహించి ఫలితాలను విడుదల చేసిన క్రమంలో ప్రధాని మోదీ విమర్శించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లో పర్యటించిన ఆయన గ్వాలియర్ సభలో మాట్లాడుతూ విపక్షాలపై విరుచుకుపడ్డారు.ఎవరి పేరును, ఏ సర్వేను ప్రస్తావించకుండా కులగణన నేపథ్యంలో పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి సాధనలో విఫలమయ్యారు. నాడు పేదల మనోభావాలతో ఆడుకున్నారు నేడు అదే క్రీడను కొనసాగిస్తున్నారు. ఇంతకుముందు కులం పేరిట దేశాన్ని విభజించారు. ఇప్పుడూ అదే చేస్తున్నారు. గతంలో అవినీతి నింద మోసారు. ప్రస్తుతం మరింత అవినీతిపరులుగా మారారు' అని ప్రతిపక్ష పార్టీలపై మోదీ విమర్శనాస్త్రాలు సంధించారు. కులం పేరిట ప్రజలను విభజించడం పాపమన్నారు. దేశవ్యాప్తంగా కులగణన కోసం కాంగ్రెస్ డిమాండ్, బీహార్ కులగణన ఫలితాలు విడుదల నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా, బీహార్ కులగణన కంటితుడుపు అని బీజేపీ నేతలు ఘాటు విమర్శలు చేసిన విషయం తెలిసిందే.

కులగణన చారిత్రకం

పాట్నా: తమ రాష్ట్రంలో కులగణన జరిపి ఫలితాలు విడుదల చేయడం చారిత్రకమని జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నారు. గాంధీ జయంతి, కులగణన వివరాల వెల్లడి ఒకే రోజు జరగడం కలిసి వచ్చిందన్నారు. కులగణన నిర్వహణకు బీహార్ అసెంబ్లీలో మద్దతిచ్చిన తొమ్మిది పార్టీలతో త్వరలోనే సమావేశం కాబోతున్నట్లు ప్రకటించారు. సర్వే వివరాలను ఆ పార్టీల నేతలకు తెలియజేస్తామని చెప్పారు. వివిధ కులాల వారి ఆర్థిక స్థితిగతుల గురించీ ఈ సర్వే ద్వారా సమాచారం అందిందన్నారు. తాజా సర్వే డేటా ఆధారంగా అన్ని వర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎక్స్ మాధ్యమంగా నితీశ్ కుమార్ ప్రకటించారు.

సామాజిక-ఆర్థిక అభ్యున్నతికి దోహదం: ఆర్జేడీ

మిత్రపక్షమైన ఆర్జేడీ కూడా కులగణనకు సమర్థన తెలిపింది. ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ స్పందిస్తూ 'బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా, అవరోధాలు సృష్టించినా సర్వే విజయవంతంగా జరిగింది' అని అన్నారు. తాజా సర్వే గణాంకాలు దేశానికి ప్రామాణికమన్నారు. అణగారిన, వెనుకబడిన వర్గాలు, పేదలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించేందుకు, వారి అభ్యున్నతికి విధానాల రూపకల్పనుకు ఇవి దోహదమతుతాయని ట్వీట్ చేశారు. 2024లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం, ఆపై కులగణన నిర్వహిస్తామని కేంద్రానికి లాలూ సవాల్ విసిరారు. జనాభా లెక్కలు తేల్చడమే కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అద్దంపట్టేలా ఈ సర్వే జరిగిందని, అన్ని వర్గాల అభివృద్ధికి కృషిచేస్తామని ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ చెప్పారు.

భూ పోరాటాలకు సిద్ధం కావాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-తిరువూరు: భూపోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మికులకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా తిరువూరు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం షేక్ నాగుల్‌మీరా అధ్యక్షతన ఏ కొండూరు మండలం చీమలపాడులో సోమవారం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ. ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే భూ పంపిణీ చేసి ప్రజలకు అండగా ఉంటామని వాగ్ధానాలు చేసిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాగ్ధానాలు విస్మరించి ఎక్కడా ఒక సెంటు కూడా భూ పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. ఎక్కడన్నా పేదల చేతుల్లో భూమి ఉందంటే అవి వ్యవసాయ కార్మిక సంఘం, కమ్యూనిస్టు పార్టీల పోరాటాల ఫలితమేనని చెప్పారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలుచేసినా కొంతమందికైనా భూమి దక్కేదన్నారు. పేదల కనీస అవసరం తీరాలంటే వాళ్ల చేతిలో భూమి ఉండాలనీ, బడుగు బలహీన వర్గాలు తల ఎత్తుకొని ఆత్మగౌరవంతో బతకాలంటే భూమి అవసరం, అందుకే భూ పోరాటాలు నిర్వహించాలని కోటేశ్వర రావు నొక్కి చెప్పారు. తిరువూరు నియోజకవర్గంలో వేలాది ఎకరాల అటవీ భూములు సాగుకు లాయికీగా ఉన్నాయనీ, ప్రభుత్వం పేద, వెనకబడిన వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ చేయాలని లేని పక్షాన నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలను సమీకరించి భూఆక్రమణ నిర్వహిస్తామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తూము కృష్ణయ్య మాట్లాడుతూ పేదల సాగులో ఉన్న అన్ని రకాల భూములకు సాగు హక్కు కల్పించి సాగుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వంరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్థలాలు ప్రజలకు నివాస యోగ్యంగా ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మేకలడేవిడ్ నియోజకవర్గంలోని భూ పోరాటాల వివరాలను తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు బుడ్డి రమేశ్. ఎం త్యాగరాజు షేక్ కరీముల్లా, ప్రభాకర్ నాగమణి మైల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై 'మెయిన్స్' వాయిదా వేయాలి

ఈశ్వరయ్య, సిద్దిక్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఎస్సై మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని సీపీఐ ఏపీ కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఏపీ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ షేక్ సిద్దిక్ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ నోటిఫికేషన్ ఇచ్చి ప్రాథమిక పరీక్ష నిర్వహించి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించకుండా నియామక ప్రక్రియ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న 20వేల పోలీసు ఉద్యోగాలు ఎక్కడ అడుగుతారన్న భయంతో ఆరు నెలల కాలయాపన తర్వాత ఈవెంట్స్ నిర్వహించడంతో అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురయ్యారన్నారు. అనేకమంది అభ్యర్థులు పేదలని, చిరు ఉద్యోగులని తెలిపారు. వారిని ప్రభుత్వోద్యోగాలకు దూరం చేసే ఆలోచన దుర్మార్గమన్నారు. ఖాళీలు భర్తీ చేయడంలో ప్రణాళిక లోపించిందని ఇష్టానుసారంగా శరీరదారుఢ్య పరీక్షలు, మెయిన్స్ పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎస్సై మెయిన్స్ పరీక్షలకు రెండు నెలలు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రవిడ సురేశ్, బీసీవై పార్టీ యువ నాయకుడు పవన్ అనిల్ పాల్గొన్నారు.

ఏకమత ఆధిపత్యానికి తెరలేపుతున్న బీజేపీ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర-విశాఖ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో ఏకమత ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు కుట్రలు పన్నుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి విమర్శించారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం జీవీఎంసీ వద్ద గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గాంధీజీ శాంతియుత పోరాట స్ఫూర్తితో మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు గాంధీ జయంతిని జరుపుకుం టున్నామని, గాంధీ హత్యకు పాల్పడిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకత్వ తీరును విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయకుండా అపహాస్యం చేస్తూ పరిపాలన సాగిస్తున్న మతోన్మాద బీజేపీని ఇంటికి సాగనంపాలన్నారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన సాగిస్తోందన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీలకు మారు పేరైన లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కూడా నేడేనని పేర్కొంటూ ఆయన అనుసరించిన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యాంజనేయ, జి.ఎస్.జె. అచ్యుత రావు, ఎస్.కె.రెహమాన్, జి.రాంబాబు, పి.చంద్ర శేఖర్, సి.ఎన్. క్షేత్రపాల్, ఎండీ బేగం, ఎ.దేముడమ్మ, ఎన్.నాగ భూషణం, ఎ.ఆదినారాయణ, ఎం.శ్రీనివాసరావు, జి.కాసులరెడ్డి, అరసం శ్యాంసుందర్, విజ్ఞానంద్, తదితరులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

మోదీ, జగన్‌ను ఇంటికి పంపిద్దాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం : కేంద్రం లోని మతోన్మాద పాలకులు జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న భారతదేశాన్ని బడా కార్పొరేట్‌లకు, సామ్రాజ్య వాదులకు అమ్మివేస్తున్నారని, బీజేపీ విధానాలతో దేశం అట్టడుగుకు పోతున్నందున భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు సీపీఐతో కలిసి నడవాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సోమవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్థానిక జాంపేట వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయని, ప్రజా ఉద్యమాలు, ప్రజా సంఘాలపై దాడులు, నిర్బంధాలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. నేడు ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడిందని, యువతరంలో ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా ప్రజల ఆలోచనను మూఢనమ్మకాల వైపు మళ్లిస్తున్నారని అన్నారు. మణిపూర్ ఘటనలపై నోరు మెదపని ప్రధాని మోదీ సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై మాత్రం ఆగమేఘాల మీద విరుచుకుపడ్డారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సనాతన ధర్మం పేరుతో లబ్ధి పొందేందుకు మతాల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. ఇటువంటి తరుణంలో గాంధీజీ నడిచిన మార్గం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. లౌకిక దేశం పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, మత విద్వేషాలను పక్కన పెట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్లు సంఘం అధ్యక్షులు కుంద్రపు రాంబాబు, మహిళా సమాఖ్య నేత రాణి, నగర సహాయ కార్యదర్శులు సప్ప రమణ, సి.నౌరుజీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్, ఏఐవైఫ్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట లక్ష్మణ్, పార్టీ నగర కార్యవర్గ సభ్యులు సెపీని రమణమ్మ, నల్ల రామారావు, యడ్ల లక్ష్మి, కొండవతి, ఉమ, జి.ఎ.రామారావు, రామకృష్ణ, భద్రరావు, జట్ల సంఘం నాయకులు దేవుడు, అప్పల నాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రామీణ తంతి తపాలా ఉద్యోగుల సమ్మె

ఏఐటీయూసీ మద్దతు: రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామీణ తపాలా ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని తదితర దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దశలవారీ ఆందోళన చేపట్టినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, రూ.10,12 వేల చాలీచాలని జీతాలతో గ్రామీణ తపాలా ఉద్యోగులు అహర్నిశలు పని చేస్తున్నారని, జీతాలు వెంటనే పెంచాలని, పెన్షన్ గ్రాట్యుటీ, ఆరోగ్య బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 140 సంవత్సరాల చరిత్ర కలిగిన తపాలా శాఖలో కనీస వేతనాలు, సెలవులు, పని గంటల కోసం పోరాటాలు చేయవలసి రావడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఉత్తరాలు, రిజిస్టర్, పార్సిల్, స్పీడ్ పోస్ట్, సేవింగ్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్లు, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు తదితర లావాదేవీలు, ఆదాయ వనరులు కలిగి లాభాల బాటలో నడుస్తున్న తపాలా శాఖ ఇటీవల ఐపీబీ ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకుగా అవతరించింది. పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, ప్రమాద బీమా, హౌసింగ్ లోన్ తదితర లావాదేవీలు జరుగుతూ లాభాల్లో నడుస్తున్న తపాలా శాఖ గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం బుధవారం జరిగే సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రవీంద్రనాథ్ తెలిపారు.

నిలువు దోపిడీకి నిదర్శనం జీపీఎస్: ఎస్టీయూ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులను నిలువునా దోపిడీ చేసేందుకే ప్రభుత్వం జీపీఎస్‌ను తెరపైకి తెచ్చిందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్నలు పేర్కొన్నారు. సోమవారం కడపలోని వీవీఆర్ ఎస్టీయు భవన్‌లో జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సాయి శ్రీనివాస్, తిమ్మన్నలు మాట్లాడుతూ... సీపీఎస్ లో కనీసం పదవీ విరమణ చెందేటప్పుడు ఉద్యోగులు పొదుపు చేసుకున్న సొమ్ములో కొంత మొత్తమైనా వెనక్కు వచ్చే అవకాశం ఉండేదని... ఇప్పుడు ప్రభుత్వం జీపీఎస్ తీసుకొచ్చి ఆ వెసులుబాటు కూడా లేకుండా చేసిందన్నారు. ఉద్యోగుల ఖాతాలో పొదుపు చేసుకున్న పెద్ద మొత్తాలపై కన్నేసిన రాష్ట్రప్రభుత్వం... వాటిని కాజేయాలనే దురుద్దేశంతోనే జీపీఎస్‌ను అమలు చేయాలని భావిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వం చేతిలో రాష్ట్రప్రభుత్వం కీలుబొమ్మగా మారి,అప్పుల కోసం వారు గీసిన గీత దాటలేక... వారి అడుగులకు మడుగులొత్తుతూ...మేకపోతు గాంభీర్యంతో పాలన సాగిస్తోందన్నారు. నిజంగా బలమైన ప్రభుత్వం అని మీరు భావిస్తే... పంజాబ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల మాదిరి సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సీపీఎస్ విషయంలోనే కాక ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి అవలంబిస్తూ, ఉపాధ్యాయుల మనుగడకే ముప్పు తెచ్చేలా వ్యవహరించడం అన్యాయమన్నారు. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని... ఇచ్చిన హామీ మేరకు ఓపియస్, డీఏలు, పీఆర్సీ ఇవ్వమని అడుగుతుంటే... ఆరోజు అవగాహన లేక హామీ ఇచ్చాం. అలా ఇవ్వడం కుదరదు అని చెప్పి, మాట మార్చి రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారన్నారు. యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగుల నెలవారీ జీతాల నుండి మినహాయించిన కొంతమొత్తాన్ని జెడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లాంటి వారి వ్యక్తిగత ఖాతాలలో నిల్వ చేసు కుంటే... వారికి తెలియ కుండా వారి ఖాతాల్లో సొమ్ము కొల్లగొట్టడం ఎంత వరకు సమంజసమో సమాధానం చెప్పాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని జాతీయ విద్యా విధానాన్ని అత్యుత్సాహంతో లాభనష్టాలు ఆలోచించకుండా అమలు చేసిన కారణంగా ఈరోజు ప్రాథమిక విద్యావ్యవస్థ ప్రమాదపుటంచుల్లోకి నెట్టివేయబడిందన్నారు. ముందు చూపు లేకుండా లక్షలకు లక్షలు ప్రజాధనాన్ని నాడు-నేడు పేరుతో ఖర్చు చేసి, విలీన ప్రక్రియ పేరుతో ఆ పాఠశాల్లోని పిల్లలందరినీ బయటకు పంపించడమేంటో మాకెవరికీ అంతుబట్టడం లేదన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికే సంస్కరణలు చేపడుతున్నామని చెబుతున్న ప్రభుత్వం రాష్ట్రంలో తొమ్మిది వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు సృష్టిస్తే... ఐదు తరగతులకు ఒక్క ఉపాధ్యాయుడు నాణ్యమైన బోధన ఎలా అందిస్తాడో సమాధానం చెప్పాలన్నారు. ఇంకా విచిత్రమేమిటంటే గురువులతో పనిలేదు గూగుల్ ఉందిగా అని ఒక మంత్రి, ఉపాధ్యాయులకు, సంఘాలకు ఏమీ పని లేక విమర్శిస్తున్నారని ఇంకొక మంత్రి, ఇంత మంది ఉపాధ్యాయు లెందుకు దండగ నేనొక్కడినే రాష్ట్రంలోని పిల్లలందరికీ ఆన్ లైన్ ద్వారా పాఠాలు చెబుతానని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగారు అంటున్నారంటే... ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయులు, విద్యారంగం పట్ల ఉండే చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుందన్నారు. ఒక బాధ్యత కలిగిన ఉపాధ్యాయ సంఘంగా పేద,బడుగు,బలహీన వర్గాల పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉద్యోగ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకోసం ఉద్యమాలు, పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, దాదాపీర్, ఇలియాస్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అన్నమయ్య జిల్లా ప్రధానకార్యదర్శి భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు సురేష్ బాబు,నరసింహారెడ్డి,జయరామయ్య,రషీద్ ఖాన్,సంగమేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ కన్వీనర్లు రవిశంకర్ రెడ్డి,శంకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, తిరుపతిరెడ్డి తదితర జిల్లా, మండల కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

బాబు-పవన్ కలయిక అట్టర్‌ఫ్లాప్: అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయిక అట్టర్ ఫ్లాప్ అయిందని, అవనిగడ్డలో వారాహి సభే ఇందుకు నిదర్శనమని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అవినీతిపరుల దీక్షలు, గాంధీకి ఆత్మక్షోభ అని వ్యాఖ్యానించారు. నిరాహార దీక్షలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, టీడీపీ కుతంత్రాలను ప్రజలు నమ్మరన్నారు. చంద్రబాబు అవినీతి కేసులో జైలుకు వెళ్లి, జైలులో నిరాహార దీక్ష చేస్తుంటే, మహాత్మాగాంధీ ఆత్మ క్షోభించదా అని ఎద్దేవా చేశారు. పవన్‌ను కాపు సామాజికవర్గం సమర్థించడంలేదని, చంద్రబాబుతో పవన్‌కళ్యాణ్ కలయిన అనైతికం, అపవిత్రమని ప్రజలు తేల్చేశారన్నారు. పవన్‌తో పాటు జనసేన కార్యకర్తలు వాస్తవాలను గుర్తించాలని హితవు పలికారు. చంద్రబాబు అవినీతి సొమ్ము వారాహికి ఇంధనమని విమర్శించారు. పొత్తుల పేరుతో బీజేపీ నేతల చెవుల్లో పవన్ పూలు పెట్టారని దుయ్యబట్టారు. బీజేపీతో పొత్తు ఉందా? లేదా? చంద్రబాబుతో జతకట్టడం ఎందుకు?, ఇది ప్యాకేజీ కాక మరేమిటి? అని నిలదీశారు. తన సభలు విజయవంతం చేసుకోవడానికి పవన్ తన సామాజికవర్గం వారు ఎక్కువగా ఉంటే ప్రాంతాలలో సభలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇది చంద్రబాబు సలహా అయి ఉంటుందని, కాపులను పక్కదారి పట్టించి, తమకు అనుకూలంగా మార్చుకోవడం కోసం పవన్ యత్నిస్తున్నారని, ఇదే ప్రయత్నాన్ని కొంత కాలంగా చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ చేస్తున్నారని అంబటి రాంబాబు అన్నారు. అవనిగడ్డలో రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉంటే, వారిలో 70 వేల మంది కాపులు ఉన్నారు కాబట్టే పవన్ అక్కడ సభ పెట్టారన్నారు. తెలుగుదేశం పార్టీ-జనసేనతో సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడుతుందని పవన్ అన్నారని గుర్తుచేస్తూ బీజేపీ ఏమైందని ప్రశ్నించారు. నీ పొత్తు బీజేపీతోనా లేక టీడీపీతోనా అన్నది స్పష్టంచేయాలని పవన్‌కు సవాల్ విసిరారు. పవన్‌కు నిజాయితీ, నిబద్ధత ఉంటే చంద్రబాబుకు ఎందుకు మద్దతిస్తున్నట్లని ప్రశ్నించారు. చంద్రబాబు నీతిమంతుడా? స్వాతంత్ర్య సమరయోధుడా? చె గువేరాతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నాడా? అంటూ మంత్రి ఎద్దేవాచేశారు.

ఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శిగా శివారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె. శివారెడ్డి ఎన్నికయ్యారు. బీహార్ రాష్ట్రం బెగుసరాయ్‌లో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు జరిగిన ఏఐఎస్ఎఫ్ 30వ జాతీయ మహాసభలలో నూతన కమిటీ ఎన్నికైంది. జాతీయ కార్యదర్శిగా కె.శివారెడ్డి ఎన్నికయ్యారు. తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో శివారెడ్డి ఏఐఎస్ఎఫ్ సభ్యులుగా చేరారు. జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై ఆందోళనలో పాల్గొన్నారు. జిల్లాలో జరిగిన అనేక పోరాటాలలో పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్‌లో జిల్లాలో అనేక బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రంలో బలమైన విద్యార్థి ఉద్యమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తున్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై దశల వారి ఆందోళన

గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకు (వీఆర్‌ఏ)లసంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని విజయవాడ హనుమాన్ పేట, లెనిన్ సెంటర్ వీధిలో సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 20 వేల మందికిపైగా వీఆర్‌ఏలు గ్రామస్థాయిలో పని చేస్తున్నారని, వారు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలకు కనీస వేతనం 25,250 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన వారికి వీఆర్వోలు, అటెండర్లు. వాచ్‌మన్, చైన్‌మన్, డ్రైవర్లుగా

పదోన్నతి కల్పించాలని కోరారు. అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వీఆర్‌ఏల ఆందోళనకు మద్దతు పలికి... వైసీపీ ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా వారి గోడును వినలేదన్నారు. నామినీ వీఆర్‌ఏ లను రెగ్యులర్ చేసి పే స్కేల్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏలను ఐక్యం చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి అనుగుణంగా విజయవాడలో వీఆర్‌ఏల సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లి పోగు నాగేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్మది ఈశ్వరయ్య. రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ, పుల్లయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెప్పలి మణికుమార్, బీ శ్రీనివాసులు, బాషా, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ఓ మహాత్మా ఇంకెన్నాళ్లీ డోలీ మోతలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఓ మహాత్మా! ఇంకెన్నాళ్లు అడవి బిడ్డలకు ఈ డోలీ మోతల కష్టాలంటూ మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గిరిజనుల డోలీ మోతల కష్టాలపై ఆవేదన వ్యక్తపరుస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటయిన జన జాగరణ సమితి పోస్టర్ ఆలోజింపజేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 సంవత్సరాలలో అనేక ప్రభుత్వాలు మారినా అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనుల తలరాతలు మారలేదని, అడవి బిడ్డలు అనారోగ్యం పాలైనా, పాము కాటుకు గురైనప్పుడు, గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినప్పుడు సమీప ఆస్పత్రులకు తీసుకువెళ్లడానికి ఏజెన్సీలోని చాలా గ్రామాలకు రోడ్డు మార్గం లేకుండా పోయింది. సుమారు 20 కిలోమీటర్లకు పైగా డోలి మోతలతో గుట్టలు, వాగులు, వంకలు దాటుకుంటూ నరకయాతన పడుతున్నారు. చాలాసార్లు గర్భిణులకు సరైన సమయంలో వైద్యం అందక డోలిలోనే ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. విశాఖ నగరంలో ప్రజలు అనుభవిస్తున్న సౌకర్యాలతో పోలిస్తే గిరిజనులకు 10 శాతం సౌకర్యాలు కూడా లేకపోవడం దురదృష్టకరం. గిరిజనుల దయనీయ పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన మెరుగైన రోడ్లు, వైద్య సదుపాయం కల్పించాలని జనజాగరణ సమితి డిమాండ్ చేస్తోంది.

ఆస్పత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు

జీతాలు చెల్లించకపోతే పోరాటం ఉధృతం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన పారిశుధ్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు, సూపర్‌వైజర్లకు జీతాలు చెల్లించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాష్ ప్రభుత్వ వైద్యాధికారులను, సంబంధిత కాంట్రాక్ట్ సంస్థలను హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం డీఎన్ఆర్ అమర్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో యూనియన్ విజయనగరం జిల్లా సర్వసభ్య సమావేశం బీ లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పూడోట ప్రకాష్ మాట్లాడుతూ... టీవీటీ గ్రూప్, స్కాట్ లేండ్ గ్రూప్ కాంట్రాక్టర్లు పాలకుల దన్ను తో నెలల తరబడి జీతాలు చెల్లించకుండా పారిశుధ్య కార్మికులతో, సెక్యూరిటీ గార్డులతో గొడ్డు చెక్కిరి చేయించుకుంటారా అని మండిపడ్డారు. జిల్లా ప్రభుత్వ సర్వజన, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సూపర్వైజర్లకి ప్రభుత్వం జారీ చేసిన 549 జీవో ప్రకారం... కాంట్రాక్ట్ కార్మికులకి రూ.16వేలు, సెక్యూరిటీ గార్డులకి జీఓ నెం. 43 ప్రకారం జోన్-1 వారికి 11,912 /-, జోన్-2 వారికి 11162 /-, జోన్-3 10,912 /- జీతాలు ప్రకటించిన ప్రభుత్వం... జీతభత్యాల విషయం తెలంగాణ నల్లగొండ జిల్లాకు చెందిన టీవీటీ గ్రూప్స్‌కు, భీమవరంలో ఉన్న స్కాట్ ల్యాండ్ గ్రూప్ కాంట్రాక్టరుకి అప్పగించడం చూస్తుంటే... దళారీ వ్యవస్థను ఎంతలా పోషిస్తున్నారో తేటతెల్లమవుతుందని అన్నారు. దీనివల్ల పెరిగిన వేతనాలు ఇవ్వకుండా, ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించకుండా కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు వెంటనే కలుగ జేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ అప్కాశ్‌లో చేర్చి ప్రతి నెలా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించి, ప్రభుత్వం ఇచ్చిన జీవో ల ప్రకారం కాంట్రాక్టర్ల చేత జీతాలు ఇప్పించి... కార్మికుల సమస్యలు సామరస్యంగా పరిష్కారం చేయాలని... లేని పక్షంలో రానున్న రోజుల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరంగా చేస్తామని పూడోట ప్రకాష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు, జిల్లా కార్యదర్శులు పురం అప్పారావు, బాలి గౌరినాయుడు, పీఆర్‌ఓ కాళ్ల పాపారావు, మహారాజా, ఘోషా, నెల్లిమర్ల, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, భోగాపురం ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆచరణలేని నిర్ణయాలు

కార్మిక వర్గం నేడు ఎదుర్కొంటున్న సమస్యలను, కష్టాలను పరిష్కరిస్తామని ఆయా ప్రభుత్వాలు వాగ్దానాలు, నిర్ణయాలు తీసుకుంటాయేగాని ఆచరణ ఉండదు. కోవిడ్–19 మహమ్మారి మన దేశాన్ని చుట్టుముట్టినప్పుడు కార్మికులు, సామాన్య ప్రజలు ఎనలేని కష్టాలు పడ్డారు. పనులు లేక, ఆదాయం లేక జీవనం సాగించడం సైతం కష్టమైంది. చిన్న, పెద్ద పరిశ్రమలు మూతపడి కోట్లాది మంది రెగ్యులర్ కార్మికులు, రోజువారి పనిచేసి జీవించే శ్రామికులు అనేక నెలల పాటు పనులు లేక తల్లడిల్లారు. బీజేపీ ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించలేదు. కార్మికులు మహత్తర పోరాటాలు జరిపి సాధించుకున్న హక్కులను ప్రభుత్వం హరిస్తూ 40కి పైగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కోడ్‌లను రూపొందించింది. కార్మిక వర్గం దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించడంతో ప్రస్తుతానికి కోడ్‌లను అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పరిస్థితి ప్రపంచ వ్యాప్తంగా నెలకొని ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత బలపడుతూ, పాలకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ నిరంకుశంగా వ్యవహరిస్తూ, రైతులు, కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారు ఎక్కువగా నష్టపోతున్నారు. ఈ తరుణంలో ఐదు దేశాలతో కూడిన బ్రిక్స్ దేశాల సమావేశం చాలా గొప్ప నిర్ణయాలు తీర్మానాలు చేసింది. ఆచరణలేని నిర్ణయాలు శుద్ధ దండగ. తొమ్మిదవ బ్రిక్స్ కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రులు గత నెల 26 నుండి 29 వరకు దక్షిణాఫ్రికా నగరం డర్బన్‌లో సమావేశమై కార్మిక సమస్యలను చర్చించి నిర్ణయాలను సంయుక్త ప్రకటనలో తెలిపింది. మంచి వేతనంతో కూడిన, గౌరవనీయమైన పని లభ్యత నేడు కీలకమైన సమస్య. వీటిపైన సమావేశం చర్చించింది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాల కార్మిక శాఖ మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్మిక హక్కులను పెంపొందించడం, గౌరవనీయమైన ఉద్యోగాలు కొరతను తగ్గించడం, సార్వత్రిక సామాజిక రక్షణ అందుబాటు, కనీస ఆదాయం లభ్యత, గౌరవనీయమైన ఉద్యోగావకాశాలను పెంచడం సమస్యలు నేడు పట్టి పీడిస్తున్నాయి. అలాగే స్థిరమైన పరిశ్రమల, నూతన ఆవిష్కరణలు, ఉత్పాదకతను పెంచడం కూడా వేధిస్తున్న సమస్యలే. ఈ సమస్యల పరిష్కారం పైన శ్రద్ధ వహించాలని తీర్మానించారు. భారతదేశంలో కార్మికుల పరిస్థితి బీజేపీ ప్రభుత్వ హయాంలో దిగజారుతున్నదే కాని మెరుగుపడటం లేదు. కార్మిక కోడ్‌లు ప్రస్తుతానికి అమలు జరగకపోయినప్పటికీ తయారుచేసిన వాటిని రద్దు చేయలేదు. కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలు కోడ్‌లను అమలు చేయబోమని ప్రకటించడం, రాజకీయంగా పరిస్థితులు బీజేపీ అనుకూలంగా లేకపోవడం, త్వరలో ఎన్నికలు జరగనున్న తరుణంలో రైతులకు, కార్మికులకు వ్యతిరేకమైన నిర్ణయాలు అమలు జరపడంలేదు. పాలకులు అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్లకు, బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉంటున్నాయి. కార్మికులకు, కర్షకులకు, సామాన్యులకు ఉపయోగపడకపోవడం కారణంగా ఆర్థిక అసమానతలు అపారంగా పెరిగాయి. ఈ స్థితిలో ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వాలయితే డర్బన్ సమావేశం తీసుకున్న నిర్ణయాలు అమలు చేయాలి.

సాంకేతికతల వృద్ధి, వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, పెట్టుబడులలో, వాణిజ్యంలో మార్పులు, ఆర్థిక సంక్షోభాలు, కోవిడ్–19 మహమ్మారి లాంటివి బ్రిక్స్ దేశాలలోని కార్మిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. అయితే ఈ పరిస్థితులను అంతగా పట్టించుకోకుండా బహుళజాతి కంపెనీలకు, కార్పొరేట్లకు, బడా పారిశ్రామికవేత్తలకు వివిధ రకాల రాయితీలు, సబ్సిడీలు ఇస్తూ ఆర్థిక అసమానతలు మరింతగా పెంచుతున్నారు. అందులవల్లనే కుబేరుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో డర్బన్ సమావేశం చేసిన తీర్మానాలు అమలు జరిపితే ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. అంతేకాదు పేదరికం, నిరుద్యోగం పెరిగితే సామాజిక అసంతృప్తి, పాలకులపై వ్యతిరేకత పెరగకమానదు. కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకొనేందుకు స్వేచ్ఛ, సమష్టి బేరసారాలు అనుమతించాలి. అయితే ఇందుకు అవసరమైన న్యాయపరమైన, సంస్థాగత విధానాల రూపకల్పన, బలమైన యాజమాన్యం, కార్మిక సంఘాలు, సమర్థవంతమైన కార్మిక శాఖ యంత్రాంగం, కార్మిక హక్కులు పెంపొందించడం, వృత్తిపరమైన సమస్యల పరిష్కార యంత్రాంగం, త్రై పాక్షికసమావేశాలు నిర్వహించడం ద్వారా కార్మికుల హక్కులను కాపాడాలి. అయితే రష్యా, బ్రెజిల్ ఇండియా, దక్షిణాఫ్రికా దేశాలలో కార్మికులకు వీటిని అమలు జరుపుతున్నారా? ముఖ్యంగా ఇండియాలో వీటి అమలు ప్రశ్నార్థకమైంది. బీజేపీ ప్రభుత్వంలో కార్మిక హక్కుల హరణ విచ్చలవిడిగా సాగుతోంది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశం ఇప్పటికీ ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించవలసిన సమస్యగానే ఉంది. నిరక్షరాస్యత, పేదరికం పెరుగుదల , విద్య ఇప్పుడు కొనుగోలు వస్తువుగా మారిపోవడం వల్ల బాల కార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. కార్మిక హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను పాటించాలని నిర్ణయాలు చేసినంత మాత్రాన చాలదు. ఇండియాలో కార్మిక వర్గం వీటి సాధనకు పోరాటాలు చేస్తున్నప్పటికీ నెరవేరకపోవడానికి పాలకుల నిరంకుశ వైఖరి పెద్ద అడ్డంకిగా తయారైంది. సార్వత్రిక సామాజిక రక్షణను మానవ హక్కుగా ఈ సమావేశం గుర్తించింది. కనీస మౌలిక ఆదాయం ఉన్నప్పుడు మానవ హక్కును పాలకులు పట్టించుకున్నారని భావించవచ్చు. బ్రిక్స్ 2017 లో జరిగిన కార్మి క శాఖల మంత్రుల సమావేశంలోనే సార్వత్రిక సామాజిక రక్షణ హక్కుగా గుర్తించాలని తీర్మానించినప్పటికీ ఇంతవరకు పట్టించుకొన్న ప్రభుత్వాలు లేవు. 2030 నాటికి ఆయా దేశాలలో ప్రజలందరికీ సార్వత్రిక సామాజిక రక్షణ సాధించాలని సమావేశంలో పాల్గొన్న దేశాలు ప్రతిన తీసుకున్నాయి. అయితే తీర్మానాలు ఆచరణ రూపంలోకి వస్తేనే నిర్ణయాలకు విలువ ఉంటుంది. సంపద, వర్గాలు, స్త్రీ పురుషుల, జాతుల మధ్య అసమానతలు తొలగించాలన్న నిర్ణయాలు పాలకులు జనాకర్షణ కోసం చేసేవేనని ఇంతవరకు అనుభవం ధృవీకరిస్తోంది.

ఉత్తర ప్రగల్భాలకు ఓట్లు రాలేనా !

డా. యం.సురేష్ బాబు

తల్లికి తిండి పెట్టనోడు పిన్నమ్మకు బంగారు గాజులు కొనిపెడతాను అన్నట్లు ఉంది ప్రధాని ప్రసంగం. రాష్ట్రాల పునర్విభజనలో భాగంగా నవ్యాంధ్రలో ఆరు సంవత్సరాల క్రిందట వెలసిన కేంద్ర విశ్వవిద్యాలయం నిధులులేక, శాశ్వత అధ్యాపకులు లేక ప్రాథమిక పాఠశాలకు ఎక్కువ, ఉన్నత పాఠశాలలకు తక్కువ అన్నట్లు ఉంది. ఇక తెలంగాణకు సమ్మక్క సారలమ్మ పేరుతో 980 కోట్లతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తారంట. నిజామాబాద్ రైతాంగం పసుపు బోర్డు ఏర్పాటు చేయమని గత పదిసంవత్సరాలుగా డిమాండ్ చేస్తుంటే ఎన్నికలకు రెండు నెలల ముందు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నారు. 2019 ఆగమేఘాలమీద ఎనిమిదిశాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించారు. యాభైఏడు శాతం పైగా ఉన్న ఒబిసిలను 27శాతం రిజర్వేషన్లకు పరిమితంచేసి కులగణన చేపట్టకుండా ఇప్పుడు మహిళా రిజర్వేషన్ల పేరుతో నాటకం ఆడుతున్నారు. పన్నెండు లక్షల కోట్లు కార్పొరేటు ఎగవేతదారుల బ్యాంకు రుణాలను రైటాఫ్‌చేసి చిన్న, సన్నకారు రైతుల రుణాలకు ఇంట్రెస్ట్ సబ్వెన్షన్, ప్రాంప్ట్ రీపేమెంట్ ఇన్సెంటివ్ ఇవ్వకుండా ముక్కుపిండి వసూలు చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. కేంద్రం ప్రవేశ పెట్టిన నూతన విద్యుత్‌బిల్లు, సంస్కరణల మూలంగా వ్యవసాయబోర్లకు మీటర్లు బిగిస్తున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన మునిసిపల్, అర్బన్ డెవలప్‌మెంట్‌లో సంస్కరణల్లో భాగంగా ఆస్తిపన్ను, నీటిపన్ను, చెత్త పన్ను, స్వచ్ఛభారత్ సెస్ విపరీతంగా పెంచారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గతంలోఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కార్పొరేట్ శక్తులకు లబ్ధిచేకూర్చే విధంగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కార్పొరేట్ శక్తుల చేతులలో బంది చేస్తున్న బీజేపీ ప్రభుత్వం, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజలను మోసగించారు.

ఉద్యోగాలు కల్పన, ఉపాధి భ్రాంతిగానే మిగిలింది. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్ల నిర్మాణానికి ఆర్థికసాయం ఎంత మందికి చేశారు? నోట్ల రద్దు ద్వారా అవినీతి సొమ్మంతా ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి రూ.15 లక్షలు అకౌంట్‌లో వేస్తానన్న మోదీ ఇప్పటికీ ఎంతమంది అకౌంట్లలో రూ. 15 లక్షలు వేశారు. దేశంలో నిరుద్యోగం పెరిగి, ప్రజల ఆదాయ వనరులు తరుగుతున్నాయి. ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రజలకోసం కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చు, కేటాయింపులు పడిపోతున్నాయి. రైతులు, ఇతర అన్ని తరగతుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ప్రజల అప్పులు పెరుగుతున్నాయి. శత కోటీశ్వరుల అప్పులు రద్దు అవుతున్నాయి. వేళ్ళ మీద లెక్క పెట్టగలిగిన సంఖ్యలో ఉన్న కుబేరుల సంపద అంతులేకుండా పెరుగుతున్నది ఎవరి మద్దతుతో ఇలా జరుగుతున్నది అనే సత్యం ప్రజలు తెలుసుకుంటున్నారు. మోదీ ప్రభుత్వం రాఫెల్ కుంభకోణం రూ.68వేల కోట్ల విలువైన రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలుకు సంబంధించి రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందంపై పెద్దఎత్తున అవినీతి, మనీ లాండరింగ్, ఆశ్రిత పక్షపాతం, అక్రమాలు, పన్నుల మాఫీల ద్వారా అనుచితలబ్ధి వంటి

పసుపు రైతుల ఆందోళన

ఆరోపణలు వెలువడ్డాయి. రక్షణ పరికరాల సమీకరణ పద్ధతి (డిపిపి) కింద 126 రాఫెల్ యుద్ధ విమానాలను సమకూర్చుకునేందుకు ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదిరింది. డసాల్ట్ నుండి హెచ్.ఎ.ఎల్ కు సాంకేతికతను బదిలీ చేసుకుని, దానితో వీటిలో 108 విమానాలను భారత్‌కు చెందిన హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) తయారుచేసి ఇచ్చేలా కూడా అంగీకారం కుదిరింది. ఒప్పందాన్ని కాదని ఆనాడు మోదీ తాజాగా ఒప్పందాన్ని ప్రకటించడం వివాదాస్పదమైంది. ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఒప్పందంలో అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఏరోస్పేస్ భాగస్వామ్యాన్ని అకస్మాత్తుగా ప్రవేశపెట్టారు. ఏరోనాటిక్స్‌లో రిలయన్స్ కంపెనీకి అప్పటికి ఎలాంటి అనుభవంలేదు. పైగా కంపెనీ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నది, ఇటువంటి ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా లేదు. డసాల్ట్‌కు, ఏవియేషన్ రంగంలో ఎలాంటి అనుభవంలేని రిలయన్స్, ఏరోస్పేస్‌కు మధ్య అకస్మాత్తుగా ఒప్పందం కుదరడం, పాలక వర్గంతో అనిల్ అంబానీకి వున్న సాన్నిహిత్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ ఒప్పందం చుట్టూ అనేక ఆరోపణలు అలుముకున్నాయి. చత్తీస్‌గఢ్‌లో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొన్ని బొగ్గు బ్లాకులను అభివృద్ధిచేసి, బొగ్గు తవ్వేందుకు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలకు లైసెన్సులు ఇచ్చింది. ఈ లైసెన్సుల జారీపై ఆరోపణలు రావడంతో సుప్రీంకోర్టు 2014లో వాటన్నింటినీ రద్దుచేసింది. అప్పుడే అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం గనుల అభివృద్ధి, ఖనిజాన్ని వెలికితీయడానికి లైసెన్సులు జారీచేసే అంశంపై 2015లో కొత్త చట్టం తెచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చత్తీస్‌గఢ్‌లోని పర్సా, కంటా బొగ్గు బ్లాకుల లైసెన్సులు కూడా రద్దయ్యాయి. కానీ, వాటిల్లో బొగ్గు తవ్వకొనేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం అదానీ గ్రూప్‌నకు అనుమతి ఇచ్చింది. ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్‌కు 25శాతం వాటా దక్కగా, ఏఈఎల్‌కు ఏకంగా 75శాతం వాటా దక్కింది. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం. వాటాలు తల్లక్రిందులు కావటంతో ఈ జాయింట్ వెంచర్‌పై రాజస్థాన్ ప్రభుత్వానికి దక్కాల్సిన యాజమాన్య హక్కులు అదానీ గ్రూప్ చేతుల్లోకి వెళ్లిపోయాయి.

కోల్ ఇండియా నిబంధనల ప్రకారం దేశంలోని థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో క్యాలరిఫిక్ విలువ 2,200 కిలో క్యాలరీల కనిష్ట స్థాయివరకు ఉన్న బొగ్గును కూడా వినియోగించవచ్చు. ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్, ఏఈఎల్ మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ విలువను ఏకంగా 4వేల కిలో క్యాలరీలు పెంచేశారు. అంటే పర్సా, కంటా గనుల్లో తవ్విన బొగ్గులో క్యాలరిఫిక్ విలువ 4వేల కిలో క్యాలరీలకంటే ఎక్కువ ఉన్న నాణ్యమైన బొగ్గునే వినియోగించాలి. అంతకంటే తక్కువ ఉన్న బొగ్గును ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్ తన ప్లాంట్లలో వినియోగించకుండా తిరస్కరించవచ్చు. ఈ ఒప్పందం వెనుక అదానీ గ్రూప్‌కు ఆయాచిత ప్రయోజనం కల్పించే దురుద్దేశమే. ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్ తిరస్కరించిన బొగ్గులో 25శాతాన్ని ఏఈఎల్ ఉచితంగా తీసుకొని వేరే పవర్‌ప్లాంట్లకు విక్రయించుకోవచ్చని జాయింట్ వెంచర్ నిబంధనల్లో పొందుపర్చారు. ఈ రెండు బ్లాకుల్లో వెయ్యి మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీయాలని ఈ కంపెనీల లక్ష్యం. అంటే మొత్తం బొగ్గులో 25 శాతం అంటే.. 250 మిలియన్ టన్నుల బొగ్గును అదానీ గ్రూప్ ఉచితంగా పొంది, తనకు ఇష్టం వచ్చిన కంపెనీలకు అమ్ముకోవచ్చు. దానివల్ల వచ్చే ఆదాయంలో పైసా కూడా ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్‌కు ఇవ్వాల్సిన పనిలేదు. అంటే అదానీగ్రూప్ ఉచితంగా లభించే 25శాతం బొగ్గుతోనే రూ.లక్ష కోట్లు సంపాదించుకొనే అవకాశం లభించింది. గతంలో గోదావరిఖని పర్యటనకు వచ్చిన సందర్భంగా సింగరేణి బొగ్గు బ్లాకులను వేలంవేసే ప్రసక్తే లేదని ప్రకటించిన మోదీ నేడు వేలానికి సిద్ధమవుతున్నారు. బీజేపీ పెట్టిన అన్ని ప్రజావ్యతిరేక బిల్లులకు తెలుగుదేశం, వైఎస్సార్సీపీ ప్రత్యక్ష మద్దతు తెలిపారు. అలాగే ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ దాడులు జరిగినప్పుడు, నాయకులపై చర్యలకు ఉపక్రమించినప్పుడు, బీజేపీ నాయకులు లైంగికదాడులు చేసినప్పుడు, సామాజిక సమగ్రత లేకుండా ఒక వర్గంపై దాడులు చేసినప్పుడు తెలుగుదేశం, జనసేన, వైఎస్ఆర్‌సీపీ పరోక్ష మద్దతు తెలపడం సిగ్గుచేటు. రానున్న ఎన్నికల్లో విజ్ఞత కలిగిన ప్రజలు అవకాశవాద మతతత్వ పార్టీలకు బుద్ధి చెబుతారని ఆశిద్దాం. వచ్చే అన్ని రాష్ట్రాల శాసనసభ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ, ప్రజా వ్యతిరేక విధానాలు ఎండ కట్టడానికి ఇప్పటినుండి ప్రజలంతా ఏకం కావాలి.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

దోచే వారెవరురా?

చింతపట్ల సుదర్శన్

మ్యావ్... మ్యావ్... భౌభౌ మియ్యావ్.... భవ్వూ... అరుగుఎక్కిన డాంకీకి చప్పుళ్లమోత వినిపించింది. డాగీ తోక ఎత్తిపట్టుకు నిలబడి ఉంది. అయిదారుడుగుల దూరంలో నల్లమచ్చల తెల్లపిల్లి తోక తిప్పుకుంటూ నిలబడి ఉంది. ఎందుకు వీళ్లిల్లాగ అర్చుకుంటున్నారు. అధికార పక్షం, ప్రతిపక్షం నాయకుల్లా అనుకుంది డాంకీ.

నువ్వో కుక్కవి అంది పిల్లి మియ్యావ్ భాషలో. నువ్వో పిల్లివి అంది డాగీ భవ్వ భాషలో. నేను నీలా అడుక్కు తినను. కష్టపడి చెమటోడ్చి వేటాడి తింటాను అంది పిల్లి రొప్పుతూ. విశ్వాసానికి మరో పేరును నా సర్వీసెస్ కోసం నాకు తిండి పెడ్తారు అంది డాగీ రోజుతూ పదవి కోసం పార్టీ పెద్దల వెనక తోక ఊపుతూ వెళ్లే మనుషుల్లాగే కద నువ్వూ అంది పిల్లి. నేను నీలా దొంగ పిల్లిని కాదు. ఇంట్లో వాళ్ల కళు గప్పి పాలూ, పెరుగూ దొంగతనం చెయ్యను అంది డాగీ. అక్కడికి నువ్వో దొరవైనట్లు ఫోజు కొట్టకు 'బెగ్ బారో స్టీల్' అన్నారు. అనగా దొంగలించడం కడుపునింపు కొడానికైతే తప్పులేదన్నమాట కదా అంది

రంగస్థలం

పిల్లి మ్యావ్ భాషలో రెచ్చిపోతూ. ఒక్కసారి నానోటికి దొరికి చూడు కొరికి చూపిస్తా అంది డాగీ. ఏంది నువ్వు కొరికేది ఊపేదీ తోకే కద. నీకు భయపడే వారెవరూ లేరు ఇక్కడ. నా సంగతి నీకు 'డీటైలు'గా తెల్సినట్లు లేదు. నామినేషన్ వెయ్యడానికి వెళ్లే గండరగండడైనా నేను అడ్డువస్తే బైటకు వెళ్లడం మానేస్తాడు. మంత్రిగా ప్రమాణస్వీకారానికి వెళ్లే నాయకుడు నా మ్యావు విని షాక్ అయి స్టోన్ అయిపోతాడు అంతెందుకు ఆసుపత్రిలో సర్జన్ కూడా నా ప్రెజెన్స్‌కు తట్టుకోలేక ఆపరేషన్ పోస్ట్‌పోన్ చేసేస్తాడు. ఎంత గొప్ప మనిషైనా సరే నేను కాళ్లకు అడ్డంపడితే అంతే. నిన్ను రాళ్లతోనూ, కర్రతోనూ బాదుతారేమోకాని నా జోలికి ఎవడూరాడు నేను ఛస్తే గిస్తే బంగారు పిల్లిని చేయంచేదమ్ములెవడికున్నాయి అంది పిల్లి.

ఈ ఆర్యుమెంట్‌కు సరైన సమాధానం కోసం వెదుకుతూ మౌనం వహించింది డాగీ. అప్పట్నించీ చోద్యం చూస్తున్న డాంకీ కల్పించుకుంది. ఏంటిది బ్రో మాటకు మాట అరుపుకు అరుపు పంచ్‌కు పంచు కూలిన కొంప అరుగు మీద ఉన్నారా, అసెంబ్లీ సెషన్స్‌లో ఉన్నారా అంది.

అలాగను పెద్ద మనిషి తరహాగా అడుగు డాంకీ నా తిండినేను తినడం తప్పా అంది పిల్లి డాంకీ కేసి పిల్లి కళ్లు మెరిసేట్టు చూస్తూ. నీ తిండి మనుషులు మసిలే మాడ్యులార్ కిచెన్‌లలో లేదా మామూలు వంటిళ్లల్లో. ఈ కూలిన కొంపలోకెందుకు జొరబడ్డావప్పా అనరిచింది డాగీ.

చుట్టుపక్క ఇళ్లల్లోంచి ఎలుకలు ఈ కూలిన కొంపవైపు రావడం చూశాను. బహుశా ఈ ఇంట్లో వాటికి డబుల్ బెడ్రూం ఇళ్లో, వాటి కాలనీయో ఉందని ఇటువచ్చా. లోపలికి వెళ్లకుండా కుక్క కాపలా కాస్తున్నావు. నా తిండి నన్ను తిననీ, నా పొట్ట కొట్టకు 'దీసీజ్ మై రిక్వెస్టు' అంది పిల్లి తోకని క్రిందకి దింపి.

అవునవును ఎవరి తిండి వాళ్లని తిననిస్తే ఏ గొడవలూ ఉండవు. ఈడీ నోటీసులు, సీబీడీ వేధింపులూ, సిట్ సాధింపులూ ఉండవు మరి అన్నాడు. అప్పుడే వచ్చిన అబ్బాయి అరుగు ఎక్కుతూ. 'ఈట్ అండ్ లెట్ అదర్స్ ఈట్' అనేది శిష్ట వ్యావహారికమైన పద్ధతి. ఒకరిమీద ఒకరు కేసులు బనాయించుకోడాలు, అక్రమకేసులని అరుచుకోడాలు ఉండవు కదా అంది డాంకీ. ప్రతిపక్షపార్టీ వాడిలాగా నామీద 'భౌ' మనవద్దని చెప్పండి సార్ అంది పిల్లి. కుక్కా, పిల్లీ ఎప్పటికీ శత్రువులనే అంటారు కదా మరి అన్నాడు అబ్బాయి. అదేం నికార్సయిన నిజం కాదు. ఆగర్భ శత్రువులైన మనుషులే అవసరానికి ఒకే పార్టీలోచేరి అబద్ధపు కావలింతలు కావలించుకోడం లేదూ. అవసరానికి పల్లికిలించడం లేదూ. పబ్బం గడుపుకోవడానికి శత్రువులే మిత్రులగుదురు కుక్కా పిల్లీ భాయి భాయి ఎందుకు కాకూడదు అంది డాంకీ. అవును రాజకీయాల్లో శాశ్వత శత్రువులంటూ ఉండరని మనుషులు అవసరానికో అబద్ధం చెప్తుంటే మనం మాత్రం కొట్టుకోవడం అవసరమా? అంది పిల్లి ముఖ్యంగా గడ్డితినే విషయంలో మనుషులంతా ఒక్కటే. అసలు కేసులు లేని లీడర్లను వెదకడం ఇసుకలో తైలం తీసినట్టే. అందరూ చరిత్రకారులే అంది డాంకీ. అందరికీ గడ్డి దొరికే ఏర్పాటు చేస్తానన్నాడో బడానేత. టికెట్టు దొరకని వాళ్లకు కమిషన్లు, కమిటీల చైర్మన్ పదవులు ఉండనే ఉన్నవి. సర్కారంటే పుష్పక విమానమే.అ ందరికీ ఏదో ఓ మూల చోటుంటుంది. ఎంతో కొంత దోచుకునే అవకాశం ఉంటుంది. ఎవరికి దొరికింది వారు దోచుకునే ఏర్పాటు చేస్తానని 'హామీ'లు ఇచ్చేస్తున్నరు. పార్టీల పెద్దలు అంటూ అరుగుదిగాడు అబ్బాయి. కుక్క అరవకుండా నిలబడ్డంచూసి ఇంట్లోకి పరుగెత్తింది మ్యావ్ పిల్లి. లోపలికి పోతేపోయింది దానితిండి దాన్ని తిననిద్దాం అనుకుంది భౌ కుక్క మనుషులకూ పశువుల్లా గడ్డి తినడం అలవాటైంది. దోచుకోడం దాచుకోడం సహజలక్షణం అయింది అనుకుంది డాంకీ.

పోలీసు కస్టడీలో హిందూత్వ వాదులు !

ఎం. కోటేశ్వరరావు

ఆమె మూడు పదులు నిండకుండానే అన్ని విధాలుగా పేరు మోసిన మోసగత్తె. హిందూత్వ వాది. అతడు తన మతం, కాషాయ దుస్తులతో మోసానికి పాల్పడిన మరో కట్టర్. వీరితో చేతులు కలిపిన మరో నలుగురితో కలసి వారు ఇప్పుడు బెంగళూరు పోలీసు కస్టడీలో ఉన్నారు. వీరు కర్ణాటకలో పక్కా హిందూత్వ వాదులుగా పేరుమోసారు. సంవత్సరాల తరబడి వారిని ఉపయోగించుకున్న బీజేపీ, హిందూత్వ సంస్థలు ఇప్పుడు వారితో తమకేమీ సంబంధం లేదని నమ్మబలుకుతున్నాయి. ఉద్రేక, ఉన్మాద ఉపన్యాసాలుచేసి రెచ్చగొట్టటంలో పేరు మోసిన హిందూత్వ నేతగా పేరున్న చైత్ర కుందాపుర, శ్రీ హాలస్వామి మహాసంస్థాన్ మఠాధిపతి అభినవ హాలస్వామి, వారితో చేతులు కలిపిన బిజెపి యువమోర్చ నేతలు, ఇతరులు ఈ కేసులో ఉన్నారు. కర్ణాటకలో ఇప్పుడు బీజేపీ టిక్కెట్ల కుంభకోణం వెల్లడికావటంతో ఆ పార్టీ ఇప్పుడు ఇరుకున పడింది.తమకేమీ సంబంధం లేదని పార్టీ నేతలు చెబుతుండగా, అగ్రనేతల ప్రమేయం ఉందని కేసుల్లో అరెస్టయిన వారు అంటున్నారు.

బీజేపీ టికెట్ వస్తే దాంతో గెలిచి ఇబ్బడి ముబ్బడిగా సంపాదించవచ్చనే దురాశతో గోవిందబాబు పూజారి అనే వ్యాపారవేత్త పైన చెప్పుకున్న మోసగాళ్ల ముఠాకు ఐదు కోట్లు సమర్పించినట్లుగా సెప్టెంబరు ఎనిమిదిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ప్రధాన నిందితుల్లో చైత్ర కుందాపుర, ఆమె అనుచరులను పోలీసు అరెస్టు చేశారు. ఈ వార్త తెలియగానే మరో ప్రధాన నిందితుడు అభినవ హాలస్వామి కాషాయ దుస్తులు పక్కనపడేసి మారువేషంలో తప్పించుకున్నాడు. అనేక రాష్ట్రాలలో ఇలాంటి మోసగాళ్లు ఎందరో ఉన్నారు. కర్ణాటకలో 2020లో బెంగళూరు పోలీసులు స్వామి అలియాస్ సేవాలాల్ అనే జ్యోతిష్కుడు యువరాజ్ రామదాస్‌ను అరెస్టు చేశారు. ఒక గవర్నర్, ఒక కేంద్ర మంత్రి, ఒక రాజ్యసభ సభ్యుడితో తనకు సన్నిహిత సంబంధాలున్నట్లు చెప్పేవాడు. 2015లో జౌళిశాఖ కేంద్ర మంత్రిగా ఉన్న సంతోష్ గాంగవార్‌కు శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనందకుమార్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. కేంద్ర సిల్క్ బోర్డు చైర్మన్ పదవి ఇప్పిస్తానంటూ ఒకటిన్నర కోట్ల రూపాయలు వసూలు చేశాడు. సదరు స్వామి ఒక ఎంపీని తిరిగి నామినేట్ చేయిస్తానని ఇరవై కోట్లు, కర్ణాటక హైకోర్టు మాజీ మహిళా జడ్జికి గవర్నర్ పదవి ఇప్పిస్తానంటూ ఎనిమిదిన్నర కోట్లు వసూలు చేశాడు. బిఎస్ ఇంద్రకళ అనే ఆ మాజీ జడ్జి నగదు రూపంలో నాలుగున్నర కోట్లు, ఆర్‌టిజిఎస్ ద్వారా రు.3.77 కోట్లు చెల్లించారు. న్యాయమూర్తులుగా ఎలాంటి వారు ఎంపిక అవుతున్నారు, గవర్నర్ పదవులను కొనుక్కోవటం ఎంత సులభంగా ఉంటుందో డబ్బు, పలుకుబడి కలవారి ప్రయత్నాల గురించి ఈ ఉదంతం వెల్లడించింది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలతో ఉన్న పలుకుబడితో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించమని ఒక డాక్టర్ 30లక్షలు సమర్పించుకున్నారట. 2019లో స్వామి తనను పది కోట్లకు మోసం చేసినట్లు శశికాంత్ బంద్రే అనే వాణిజ్యవేత్త ఫిర్యాదు చేసిన తరువాత పైన పేర్కొన్న మోసాలన్నీ వెలుగులోకి వచ్చాయి.

హిందూత్వ నాయకురాలు చైత్ర కుందాపూర్, ఆమె గాంగ్ మోసంచేసిన తీరు గురించి పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మోసగాళ్ల ముఠాలో స్వామీజీతో పాటు కబాబ్‌లు తయారుచేసి అమ్ముకొనే వ్యక్తి , ఒక క్షురకుడు ఉన్నారు. తమ సైద్ధాంతిక గురువు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, ప్రధాని కార్యాలయంలో తనకు పెద్ద తలకాయలు ఎందరో తెలుసని చైత్ర ప్రచారం చేసుకుంది. 2022లో వ్యాపారవేత్త పూజారికి ప్రసాద్ బైదూర్ అనే వ్యక్తిని పరిచయంచేసి అతను బీజేపీ కార్యకర్త అని చెప్పారు. చైత్ర తలచుకుంటే రాష్ట్రంలో, కేంద్రంలో ఏదైనా సాధించగలదని అతను పూజారిని నమ్మించాడు. అది బాగా పనిచేసిందని గ్రహించిన తరువాత ఆ ముఠా గగన్ కదూర్, రమేష్ నాయక్ అనే వారిని పరిచయం చేశారు. రమేష్ తన పేరును దాచి తాను చిక్‌మంగళూరుకు చెందిన విశ్వనాథ్ అనే ఆర్‌ఎస్‌ఎస్ నేతని గత 45 ఏండ్లుగా పని చేస్తున్నట్లు నమ్మించాడు. రమేష్ నాయక్ మూడు రోజుల్లో 50 లక్షలు, తరువాత మూడు కోట్ల మేర వసూలు చేశారు. ఆ సొమ్ములో ఒకటిన్నర కోట్లు అభినవ హాలశ్రీ స్వామి అనే మఠాధిపతికి చెల్లించినట్లు పూజారి పేర్కొన్నాడు. 2022 జూలై ఏడు నుంచి 2023 జనవరి 16 వరకు మొత్తం ఐదు కోట్లు సమర్పించుకున్నాడు.

బీజేపీ అభ్యర్థులను ప్రకటించటానికి కొద్ది రోజుల ముందు కాశ్మీరులోని ఒక ఆసుపత్రిలో ఆర్‌ఎస్‌ఎస్‌నేత విశ్వనాథ్ మరణించినట్లు గగన్ కదూర్ చెప్పాడు. అనుమానం వచ్చిన పూజారి

విచారించగా అసలు ఆ పేరుగల వ్యక్తి లేడని తేలింది.దాంతో తన డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయటంతో మోసగాళ్ల ముఠా తప్పించుకు తిరిగింది. సెప్టెంబరు పన్నెండు నుంచి హాలశ్రీ స్వామి పరారీలో ఉండి పందొమ్మిదవ తేదీ రాత్రి ఒడిషా పోలీసులకు చిక్కాడు. ఇంతకీ రమేష్ నాయక్ చిక్‌మగలూర్‌లోని ఒక క్షురకుడు అని తేలింది. చెన్నానాయక్ బెంగలూర్ కెఆర్ పురంలో వీధుల్లో కబాబ్‌లు అమ్ముతాడని పోలీసులు గుర్తించారు. పూజారి నుంచి కొట్టేసిన సొమ్ములో భారీ మొత్తాని చైత్ర నొక్కేసింది. కుందాపురలోని ఒక సహకార బాంకులో రు.1.8 కోట్లు ఫిక్సడ్ డిపాజిట్ చేసినట్లు, రు.65లక్షలు పెట్టి బంగారు నగలు కొన్నట్లు, మరో రు.40లక్షలను ఒక బంధువు సాయంతో శ్రీరామ్ బాంక్‌లో డిపాజిట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మరొక బాంకు లాకర్ నుంచి రు.23లక్షల బంగారు బిస్కట్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒకటిన్నర కోట్లు తీసుకున్న హాలశ్రీ స్వామి తప్పించుకోగా అతని కారు డ్రైవర్ పోలీసులకు దొరికాడు. సెప్టెంబరు ఎనిమిదవ తేదీన గోవింద పూజారి కేసు దాఖలు చేశారు. గోవింద పూజారి నుంచి తీసుకున్న సొమ్ముతో వ్యవసాయ భూమి కొనుగోలు, ఒక పెట్రోలు బంకులో పెట్టుబడి పెట్టినట్లు చెబుతున్నారు.

విద్యార్థినిగా ఉండగా ఏబీవీపీలో పని చేసిన చైత్ర కొన్ని పత్రికల్లో జర్నలిస్టుగా, స్పందన అనే టీవీలో యాంకర్‌గా పనిచేసింది. హిందూత్వ కార్యకర్తగా మైనారిటీల మీద రెచ్చగొట్టే ప్రసంగాలతో అనేక పాత్రల్లో కనిపించిన చైత్ర 2018లో ఉడిపి పట్టణంలో కాంగ్రెస్ మీద ధ్వజమెత్తి వెలుగులోకి వచ్చింది. కేంద్ర మంత్రులు కూడా ఆమెను ఆకాశానికి ఎత్తారు. ముస్లింల మీద విద్వేష పూరిత ప్రసంగాలు చేసినందుకు ఆమె మీద కేసులు కూడా నమోదు చేశారు. మేము ప్రతి ముస్లిం యువతి నుదుటి మీద తిలకం దిద్దుతాం అని రెచ్చగొడుతూ మాట్లాడారు. 2018లో సర్ఫ్రూజ్ ఎలా చేయాలనే అంశంపై గొడవ పడి గురుప్రసాద్ పంజా అనే హిందూ జాగరణ్ వేదిక కార్యకర్తమీద చేయి చేసుకున్న కేసులో అరెస్టయింది.

అవివాహిత అయిన చైత్ర కుందాపుర మీద ఉడిపిలో బీజేపీ కార్యకర్త సుధీన్ ఒక కేసు దాఖలు చేశాడు. తన కోసం ఒక దుకాణాన్ని కట్టిస్తానని చెప్పి ఆమె ఐదు లక్షలు తీసుకున్నదని, అది చేయకపోగా సొమ్ము వాపసు అడిగితే అత్యాచారం చేసినట్లు కేసుపెడతానని, హత్య చేయిస్తానని బెదిరించినట్లు పేర్కొన్నాడు. బీజేపీ టిక్కెట్ పేరుతో సొమ్ము తీసుకున్న వ్యాపారి పూజారిని కూడా బెదిరించినట్లు వెల్లడైంది. తాను జర్నలిస్టుగా ఉన్నప్పటి నుంచి గోవిందబాబు పూజారి తెలుసునని, బీజేపీ టిక్కెట్ కోసం చూశాడని, అతని అక్రమాలను బయట పెట్టేందుకు అతనితో సంబంధాల్లో ఉండి సమాచారం సేకరించినట్లు చెప్పుకుంది. చిత్రం ఏమిటంటే సదరు పూజారికి ఎంఎల్ఏ టిక్కెట్ రాకున్నా, ఎన్నికలకు ముందు బీజేపీ వెనుకబడిన తరగతుల మోర్చా కార్యదర్శి పదవిని బహుకరించారు.

ముంచిన గూగుల్ మ్యాప్

కారు నీటమునిగి ఇద్దరు యువ డాక్టర్ల మృతి

తిరువనంతపురం: కేరళలో విషాదం చోటు చేసుకుంది. కారు నదిలో పడిపోవడం వల్ల ఇద్దరు యువ డాక్టర్లు నీటిలో మునిగి, ఊపిరాడక చనిపోయారు. ఆ కారులో ఉన్న మరో ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే గూగుల్ మ్యాప్ ను అనసరిస్తూ... కారు నడపడం వల్ల అది నేరుగా నదిలోకి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఈ ఘటన కేరళలోని ఎర్నాకులం జిల్లా గోతురుత్ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొచ్చి జిల్లాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అద్వైత్ (29), అజ్మల్ ఆసిఫ్ (29 డాక్టర్లుగా పని చేస్తున్నారు. అయితే శనివారం అద్వైత్ పుట్టిన రోజు కావడంతో షాపింగ్ చేయాలని భావించారు. దీని కోసం ఆయన ఆసిఫ్‌ను అలాగే ఓ హాస్పిటల్ లో పని చేసే మేల్ నర్స్ జిస్మోన్, ఎంబీబీఎస్ చదువుతున్న తమన్నా, మరో హాస్పిటల్‌లో పని చేస్తున్న డాక్టర్ తబ్సీర్ కలిసి ఓ కారులో కొచ్చి నుంచి కొడుంగల్లూర్ కు శనివారం రాత్రి సమయంలో బయలుదేరారు. అయితే అదే సమయంలో భారీగా వర్షం పడుతోంది. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న అద్వైత్ జీపీఎస్ ఆన్ చేశారు. అయితే ఆ కారు ఎర్నాకులం జిల్లా గోతురుత్ ప్రాంతానికి చేరుకుంది. అందులో సూచించిన విధంగా కారు డ్రైవింగ్ చేస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో ఆ కారు నేరుగా పెరియార్ నదిలోకి వెళ్లిపోయింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న డాక్టర్ అద్వైత్, డాక్టర్ ఆసిఫ్ నీటిలో మునిగి, ఉపిరాడకపోవడంతో చనిపోయారు. మిగిలిన ముగ్గురు ఎలాగోలా ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ప్రాణాలతో బయటపడ్డ డాక్టర్ తబ్సీర్ 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడుతూ.. జీపీఎస్ దారి మళ్లించడంతో ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. 'అవును.. కారులో ఉన్న సమయంలో మేము జీపీఎస్ వాడుతున్నాం. కానీ నేను ఆ సమయంలో డ్రైవింగ్ చేయలేదు. కాబట్టి ఇది జీపీఎస్ సాంకేతిక లోపమా? లేక మానవ తప్పిదమా అనే విషయాన్ని కచ్చితంగా చెప్పలేను' అని అన్నారు. భారీ వర్షం వల్ల ఆ సమయంలో డ్రైవింగ్ చేస్తున్న సమయంలో రోడ్డు సరిగా కనిపించలేదని పోలీసులు తెలిపారు. అందుకే వారు గూగుల్ మ్యాప్ లో చూపించిన దారిని ఫాలో అవుతున్నారని పేర్కొన్నారు. కానీ డ్రైవింగ్ చేసే వ్యక్తి మ్యాప్ లో సూచించినట్టుగా ఎడమవైపు తిప్పకుండా పొరపాటున ముందుకు వెళ్లడంతో నదిలో పడిపోయిందని తెలుస్తోందని చెప్పారు. కాగా, మరణించిన వైద్యులు మంచి స్నేహితులని, ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలని యోచిస్తున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

నేరుగా నదిలోకి ....

తెలియని మార్గాల్లో ప్రయాణించొద్దు: పోలీసుల హెచ్చరిక

వర్షాకాలంలో తెలియని రూట్లలో కేవలం గూగుల్ మ్యాప్‌ను నమ్ముకొని ప్రయాణించవద్దని కేరళ పోలీసులు హెచ్చరించారు. గూగుల్ మ్యాప్స్‌ను ఉపయోగిస్తున్నప్పుడు చేయవలసినవి... చేయకూడని అంశాలను ఫేస్‌బుక్ పోస్ట్‌లో జాబితా చేశారు. రుతుపవనాల సమయంలో తరచుగా మార్గాలను మళ్లించడం జరిగిందని... అయితే అవి మ్యాప్‌లో కనిపించకపోవచ్చునని తెలిపారు. మ్యాప్‌లు తక్కువ ట్రాఫిక్ ఉన్న మార్గాన్ని చూపవచ్చుని... అయితే అలాంటి మార్గాలు సురక్షితంగా ఉండకపోవచ్చని రాష్ట్ర పోలీసులు తెలిపారు. 'గూగుల్ మ్యాప్స్ పొంగి ప్రవహించే ప్రవాహాలు, ఇరుకైన రోడ్లు, ప్రమాదకరరోడ్లు, సాఫీగా ప్రయాణించలేని రోడ్లకు దారి తీయవచ్చు' అని పోలీసులు స్పష్టం చేశారు.

విమాన ఎగ్జిట్ డోర్ తెరవబోయిన వ్యక్తి అరెస్టు

బెంగళూరు: విమానం అత్యవసర ద్వారా(ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్)న్ని తెరవడానికి ప్రయత్నించిన ఓ ప్రయాణికుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. నాగ్‌పూర్ నుంచి బెంగళూరుకు వస్తున్న ఇండిగో విమానం ఇక్కడ టేక్‌ఆఫ్ అవడానికి ముందు ఈ ఘటన జరిగింది. స్వప్నిల్ హోలీ అనే వ్యక్తి సెప్టెంబర్ 30వ తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో నాగ్‌పూర్ నుంచి బెంగళూరు వెళ్లే ఇండిగో విమానం 6ఇ 6803 ఎక్కాడు. అతడు విమానం ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్ పక్కన కూర్చున్నాడు. టేకాఫ్‌కు ముందు విమాన సిబ్బంది ప్రయాణికులకు సమాచారం ఇస్తుండగా... ఆ వ్యక్తి తలుపు తెరవడానికి ప్రయత్నించాడు. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాత్రి 11.55 గంటలకు విమానం ల్యాండ్ అయిన తర్వాత హోలీని ఎయిర్‌లైన్ సిబ్బంది పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇతడు అక్టోబర్ 1న విమానంలో బ్యాంకాక్ వెళ్లాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఎయిర్‌లైన్ సిబ్బంది దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 336 కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి హోలీని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అయితే నిందితుడు బెయిల్‌పై విడుదలయ్యాడు.

నిఫా వ్యాప్తిని సమర్థంగా అరికట్టాం

కేరళ సీఎం పినరయి విజయన్

కొచ్చి: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ఇక్కడి ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాన్సర్ స్పెషాలిటీ బ్లాక్‌ను ప్రారంభించారు. 105 పడకల సదుపాయం కలిగిన ఈ బ్లాక్‌ను రూ. 25 కోట్లతో ఆరు అంతస్తుల్లో 45,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. కొత్త క్యాన్సర్ బ్లాక్‌లో ఐసీయూ, కీమోథెరపీ యూనిట్, పురుషులు, మహిళలకు ప్రత్యేక వార్డులు,డార్మిటరీతో పాటు ఇతర సౌకర్యాలు ఉన్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విజయన్ మాట్లాడుతూ... క్యాన్సర్ చికిత్సకు ప్రత్యేక బ్లాక్‌ను ఏర్పాటు చేసుకోవడం కొచ్చిలో ఆరోగ్య రంగ అభివృద్ధికి ఊతమిస్తుందని అన్నారు. నిఫా వ్యాప్తిని సమర్థంగా నియంత్రించడంలో కేరళ ప్రజారోగ్య రంగం అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఫలితంగా మరణాల రేటు స్వల్పంగా ఉందని... వ్యాధి వ్యాప్తి కూడా నివారించబడిందని విజయన్ అన్నారు. ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న వేగవంత, సమర్థ చర్యల ద్వారా రాష్ట్రంలో నిఫా వ్యాప్తిని కట్టడి చేయగలిగామని ఆయన అన్నారు. 'కారుణ్య ఆరోగ్య సురక్షా పథతి' (కేఏఎస్‌పీ) కింద అత్యధిక సంఖ్యలో ఉచిత చికిత్సలను విస్తరించినందుకు గాను కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య మంథన్ అవార్డు-2023 రాష్ట్ర ఆరోగ్య శాఖ అందుకున్న విషయాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కేరళ వరుసగా మూడోసారి 'ఆరోగ్య మంథన్'ను గెలుచుకుందని, దాదాపు 13 లక్షల మంది లబ్ధిదారులు కేఏఎస్‌పీ ద్వారా ఉచితంగా చికిత్స పొందారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పీ రాజీవ్, ఎంబీ రాజేష్, వీణా జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలు మానవాళికి ఆదర్శం

జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా



శ్రీనగర్ : జాతిపిత జయంతిని పురస్కరించుకుని మహాత్మా గాంధీ విగ్రహాన్ని, ఆయనకు నివాళులర్పించే చరఖా స్థాపనను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సోమవారం ఇక్కడ పౌర సచివాలయంలో ఆవిష్కరించారు. బాపు ఎప్పుడూ చరఖా చుట్టుకొలత సందేశం దాని ప్రత్యక్షమైన చుట్టుకొలత కంటే చాలా విస్తృతమైనదని నమ్మేవారు. మానవాళికి సేవ చేయడం, ఇతరులను నొప్పించకుండా జీవించడం, ధనవంతులు, పేదలు, పెట్టుబడి, కార్మికుల మధ్య విడదీయరాని బంధాన్ని సృష్టించడం చరఖా లక్ష్యమని విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ అన్నారు. బ్రిటీష్ పాలనపై పోరాటంలో గాంధీ చరఖాను ముఖ్యమైన సాధనంగా ఉపయోగించారని సిన్హా చెప్పారు. ఇది స్వదేశీ ఉద్యమానికి, స్వావలంబనకు, ఆర్థిక స్వేచ్ఛకు ప్రతీక అన్నారు. గాంధీ ఆశయాలు మానవాళికి ఆదర్శమని సిన్హా పేర్కొన్నారు. 'బాపు ఆలోచనలు, ఆదర్శాల స్ఫూర్తితో మన అధికారులు సమాజంలోని ప్రతి పౌరుడి గౌరవం కోసం, సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన జమ్ముకశ్మీర్ కోసం అంకితభావంతో పని చేస్తారని ఆశిస్తున్నాను. లెఫ్టినెంట్ గవర్నర్ గ్రామాలను సామాజిక-ఆర్థిక వృద్ధికి కేంద్రంగా అభివృద్ధి చేయడానికి, గ్రామీణ జనాభా జీవితాలను మార్చడానికి జమ్ముకశ్మీర్ పరిపాలన నిబద్ధతను పునరుద్ఘాటించారు. 'నేడు జమ్ముకశ్మీర్‌లోని గ్రామాలు వివిధ ఆదాయ వనరుల లభ్యత కారణంగా అపూర్వమైన అభివృద్ధిని చూస్తున్నాయి. కొత్త పారిశ్రామికవేత్తలు గ్రామాల నుంచి కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నారు. మౌలిక వసతుల విషయానికొస్తే, గ్రామం, నగరం మధ్య అంతరాలు అదృశ్యమవుతున్నాయి' అని అన్నారు. మహాత్మా గాంధీ ఆదర్శాలను అనుసరించి, 2021-22లో జమ్ముకశ్మీర్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) సహాయంతో గ్రామాల్లో 21,640 తయారీ, సేవా యూనిట్లను స్థాపించి, 1.73 లక్షల మందికి పైగా ఉపాధిని కల్పించిందని, గత ఆర్థిక సంవత్సరంలో మరో 10,628 యూనిట్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. స్వదేశీ ఉత్పత్తుల ప్రచారం కోసం భాగస్వాములందరూ సమష్టిగా కృషి చేయాలని కూడా పిలుపునిచ్చారు. యువతకు కొత్త ఫ్యాషన్ ప్రకటనగా మారిన ఖాదీలో నిమగ్నమై ఉన్న నగర ఆధారిత స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

శివమొగ్గ ప్రశాంతం

శివమొగ్గ (కర్నాటక): ఈద్ మిలాద్ ఊరేగింపు సందర్భంగా రాళ్లదాడి ఘటనల కారణంగా నిషేధాజ్ఞలు విధించబడిన శివమొగ్గ పట్టణంలోని రాగి గూడ ప్రాంతంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం రాళ్లు రువ్విన ఘటనలతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని శివమొగ్గ పోలీస్ సూపరింటెండెంట్ జీకే మిథున్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఘటనలో పోలీసులతో పాటు కొంతమందికి గాయాలయ్యాయని, కొన్ని ఆస్తులు దెబ్బతిన్నాయని చెప్పారు. 'గాయపడినవారు, ఆస్తి నష్టానికి గురైన వారిని ఫిర్యాదు చేయాలని కోరామని, వీడియోగ్రఫీ, సీసీ కెమెరా, డ్రోన్ కెమెరా ఫుటేజీలను పరిశీలించి... దాడికి పాల్పడినవారిని పట్టుకుని, శిక్షపడేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కర్నాటక స్టేట్ రిజర్వ్ పోలీస్ (కెఎస్‌ఆర్‌పి), ఒక కంపెనీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్), 900 మంది హోంగార్డులు, 2000 మంది పోలీసు సిబ్బంది, సీనియర్ అధికారులు సహా తగినంత బలగాలు ఉన్నాయని ఎస్పీ వివరించారు. తగినంత బందోబస్తు ఏర్పాటు చేశామని... శివమొగ్గ నగరంలో ఎలాంటి సమస్య ఉండదని తెలిపారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని, ఎలాంటి పుకార్లను పట్టించుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఈద్ మిలాద్ ఊరేగింపుపై రాళ్ల దాడి జరిగిందని పుకార్లు వ్యాపించడంతో ఆగ్రహించిన అల్లరి మూక కొన్ని ఇళ్లు, వాహనాలపై రాళ్లు రువ్వి అనేకమందిని గాయపరిచిందని పోలీసులు తెలిపారు. గుంపును చెదరగొట్టేందుకు లాఠీచార్జి చేయాల్సి వచ్చిందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం రాళ్లదాడి ఘటనకు ముందు రాగి గూడ ప్రాంతంలో ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన కటౌట్‌పై నిరసనలు జరిగాయి. వివాదాస్పదమై రాతలు ఉండటంతో పోలీసులు అందులో కొంత భాగాన్ని కనిపించకుండా చేశారు. ఎస్పీ మిథున్ కుమార్, ఇతర పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు స్థానిక ప్రజలతో చర్చలు జరిపారు.

40మంది అరెస్టు: సీఎం సిద్ధరామయ్య

శివమొగ్గలో రాళ్లదాడి ఘటనకు సంబంధించి 40 మందికి పైగా దుండగులను అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. మతపరమైన కార్యక్రమాల సమయంలో భంగం కలిగించడం, రాళ్లదాడికి పాల్పడడం చట్టవిరుద్ధమని, అలాంటి సంఘటనలను తమ ప్రభుత్వం సహించదని, వాటిని అణిచివేస్తుందని ఆయన స్పష్టం చేశారు. "శివమొగ్గలో పరిస్థితి ఇప్పుడు శాంతియుతంగా, అదుపులో ఉంది. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలను అక్కడి పోలీసులు తీసుకుంటున్నారు" అని ఆయన మీడియాకు వెల్లడించారు. రాగిగుడ్డ ప్రాంతంలో రాళ్లదాడి కారణంగా దెబ్బతిన్న ఇళ్లను ఆదివారం సాయంత్రం సందర్శించిన శివమొగ్గ బీజేపీ ఎమ్మెల్యే ఎస్ఎన్.చన్నబసప్ప మాట్లాడుతూ... కొందరు బయటి వ్యక్తులు, కొందరు స్థానిక వ్యక్తుల మద్దతుతో ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయాలనుకునే వారికి శివమొగ్గ అడ్డాగా మారిందన్నారు. కాగా బెంగళూరులో హోం మంత్రి జీ పరమేశ్వర మాట్లాడుతూ... దీనిని చిన్న రాళ్ల దాడి సంఘటనగా పేర్కొన్నారు. సరైన సమయంలో పోలీసులు పరిస్థితిని నియంత్రించారని, అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. మాస్కులు ధరించిన కొందరు దుండగులు రాళ్లదాడికి పాల్పడ్డారని వచ్చిన వార్తలపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... వారిని ఇప్పుడు అరెస్టు చేశామని, విచారణ అనంతరం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి చెప్పారు.

గాంధీ, లాల్‌బహదూర్‌కు జాతి నివాళి

రాజ్‌ఘాట్, విజయ్‌ఘాట్ వద్ద ప్రధాని, మంత్రుల శ్రద్ధాంజలి

న్యూఢిల్లీ : జాతిపిత మహాత్మాగాంధీ, దేశ తొలి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రికి దేశ ప్రజలు నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులు, భారతదేశపు దిగ్గజాలైన బాపు, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశం స్మరించుకుంది. వీరిద్దరూ అక్టోబరు 2న జన్మించారు. మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఉదయం 8 గంటలకు రాజ్‌ఘాట్‌కు చేరుకొని మహాత్ముడి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన బోధలు 'మన మార్గాన్ని ప్రకాశవంతం చేయడంలో కొనసాగుతాయి' అని తెలిపారు. అలాగే, విజయ్ ఘాట్ స్మారక చిహ్నం వద్ద శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని అందించి, ప్రపంచ వ్యాప్తంగా గౌరవనీయమైన వ్యక్తిగా గాంధీజీ కొనసాగుతున్నారు. ఉదయం 8 గంటలకు రాజ్‌ఘాట్‌కు చేరుకున్న మోదీ మహాత్ముడి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్‌ఘాట్‌లో సర్వమత ప్రార్థనలు జరిగాయి. అక్కడ గాంధీకి ఇష్టమైన భక్తిగీతాల ఆలాపన కూడా జరిగింది. 'గాంధీ జయంతి ప్రత్యేక సందర్భంగా నేను మహాత్మా గాంధీకి నమస్కరిస్తున్నాను. ఆయన బోధనలు మన మార్గాన్ని ప్రకాశవంతం చేస్తూనే ఉన్నాయి. మహాత్మా గాంధీ ప్రభావం ప్రపంచమంతటా ఉంది. ఐక్యత, కరుణ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి మానవాళిని ప్రేరేపిస్తుంది' అని పేర్కొన్నారు. 'ఆయన కలలను నెరవేర్చడానికి మనం ఎల్లప్పుడూ పని చేద్దాం. అంతటా ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించండి' అని మోదీ సోమవారం 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. గాంధీకి ఇష్టమైన ప్రార్థన 'వైష్ణవ జన తో'ని జర్మన్ గాయని కసాండ్రా మే పాడిన వీడియోను కూడా ప్రధాని పోస్ట్ చేశారు. ఆయన ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆమె మనోహరమైన సంగీతాన్ని వినమని ప్రజలను కోరుతూ, తన ఇటీవలి 'మన్ కీ బాత్' ప్రసారంలో దృష్టి లోపం ఉన్న యువ గాయని గురించి ప్రస్తావించినట్లు మోదీ వివరించారు. యమునా నది ఒడ్డున ఉన్న రాజ్‌ఘాట్‌లో అనేక మంది కేంద్ర మంత్రులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధాని మోదీ శాస్త్రిని కొనియాడుతూ, 'జై జవాన్, జై కిసాన్' కోసం ఆయన చేసిన ప్రసిద్ధ పిలుపు నేటికీ ప్రతిధ్వనిస్తోందని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'భారతదేశ పురోగతి పట్ల ఆయన తిరుగులేని నిబద్ధత, సవాలు సమయంలో ఆయన నాయకత్వం ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. బలమైన భారతదేశం కోసం ఆయన దార్శనికతను సాకారం చేసుకోవడానికి మనం ఎల్లప్పుడూ కృషి చేద్దాం' అని తెలిపారు.

ఐదేళ్లలో 52శాతం తగ్గిన నక్సల్స్ హింస

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రకటన

రాయ్‌పూర్: గత ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యూఈ) ఘటనలు 52 శాతం తగ్గాయని, 589 గ్రామాలు నక్సల్స్ ముప్పు నుంచి విముక్తి పొందాయని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. నక్సల్స్ ప్రభావిత బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాలలో ఒకటైన బస్తర్ జిల్లా కేంద్రం జగదల్‌పూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు ఒక రోజు ముందు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఈ ప్రకటన వెలువడింది. ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ' కొత్త ఛత్తీస్‌గఢ్‌ను సృష్టించడం' ఆలోచనతో పని చేస్తోందని... విశ్వాసం, భద్రత, అభివృద్ధి అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు ప్రకటన పేర్కొంది. రాష్ట్రంలో పోలీసు విభాగం ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడంలో విజయవంతమైందని, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కఠిన విధానం నేర ఘటనలను అరికట్టడానికి కారణమైందని తెలిపింది. 2018 నుంచి 2022 వరకు నక్సల్స్ హింసాత్మక ఘటనల్లో 52 శాతం తగ్గుదల నమోదైంది. నక్సల్స్ హింసాకాండతో ఒకటిన్నర దశాబ్దాలుగా మూతపడిన 314 పాఠశాలలు సీఎం చొరవతో పునఃప్రారంభమయ్యాయి. అంతేకాకుండా, ఈ కాలంలో 589 గ్రామాల్లోని 5.74 లక్షల మందికి పైగా ప్రజలు నక్సల్స్ హింసాకాండ బారి నుంచి విముక్తి పొందారని ప్రకటన వివరించింది. రాష్ట్రంలో 2015 నుంచి 2018 మధ్య కాలంలో జరిగిన ఇలాంటి ఘటనలతో పోలిస్తే 2019 నుంచి ఇప్పటి వరకు మహిళలపై నేరాలు 40 శాతం తగ్గుముఖం పట్టాయని పేర్కొంది.

మహిళలపై నేరాలను అరికట్టేందుకు రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయగా... 455 పోలీస్ స్టేషన్లు, పోస్టుల్లో ప్రత్యేక మహిళా విభాగాలు పనిచేస్తున్నాయని ప్రభుత్వ ప్రకటన వెల్లడించింది. మోసపూరిత చిట్ ఫండ్ కంపెనీల ద్వారా నష్టపోయిన వారికి డబ్బు తిరిగి ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ అని పేర్కొంది.

15న ఢిల్లీలో 'ఏఎంయూ' ధర్నా

అలీగఢ్: అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం (ఏఎంయూ)లో అక్రమాలు, వైస్ ఛాన్సలర్ లేకపోవడం వంటి అంశాలపై వర్సిటీ టీచర్లు, పూర్వ విద్యార్థులు ఈనెల 15న ఢిల్లీ, జంతర్ మంతర్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ) ప్రకటించింది. అన్ని కేంద్ర వర్సిటీల టీచర్ల ప్రతినిధులు, ఏఎంయూ పూర్వ విద్యార్థులలో ప్రముఖులు ధర్నాలో పాల్గొంటారని జేఏసీ కన్వీనర్, ఏఎంయూ విద్యార్థుల సంఘం పూర్వ అధ్యక్షుడు ఆజం బేగ్ తెలిపారు. అంతర్గతంగా నిబంధనల అతిక్రమణ, అక్రమాల వల్ల ఏఎంయూలో సంక్షోభం నెలకొందని, సమస్యల పరిష్కారం కోసమే ధర్నా చేస్తున్నామన్నారు. వర్సిటీలో క్షీణిస్తున్న పరిస్థితులను ఎంపీలు, కేంద్ర విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతున్నట్లు చెప్పారు. ఈనెల 17న సర్ సయ్యద్ డేను పురస్కరించుకొని 'సేవ్ ఏఎంయూ దినం' పాటించాలని దేశ, విదేశాల్లోని పూర్వ విద్యార్థులకు ఏఎంయూ ఓల్డ్‌బాయ్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ధర్నా కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వర్సిటీ విద్యార్థులకు సూచనలు జారీచేశామని, వారి చదువుకు ఆటంకం కలగరాదన్నదే జేఏసీ ఉద్దేశమని బేగ్ తెలిపారు. ఏఎంయూ విద్యార్థి సంఘం పూర్వ అధ్యక్షుడు, ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ మాజీ ప్రో వైస్ చాన్సలర్ బషీర్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన శనివారం జేఏసీ భేటీ అయి ఉద్యమ కార్యాచరణను నిర్ణయించింది. కాగా, ఏఎంయూలో అక్రమాల గురించి గతనెలలో ఇద్దరు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు వేర్వేరు లేఖల ద్వారా రాష్ట్రపతి ముర్ము దృష్టికి తీసుకెళ్లారు.

అశోక్ గెహ్లాత్ ఓటమిని అంగీకరించారు: మోదీ

జైపూర్ : రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రారంభించిన పథకాలను ఆపవద్దని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ఇప్పటికే తనను అభ్యర్థించడం ద్వారా 'ఓటమిని అంగీకరించారు' అని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం అన్నారు. బీజేపీ ఏ పథకాన్ని ఆపదని, దానిని మెరుగుపరచడానికి మాత్రమే ప్రయత్నిస్తుందని హామీ ఇచ్చారు. చిత్తోర్‌గఢ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రసంగించిన మోదీ, ఎన్నికల బరిలో ఉన్న రాష్ట్రంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించబోమని స్పష్టమైన సూచన కూడా ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గుర్తు 'కమలం'పైనే పోటీ చేస్తుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి, విపక్ష నేత రాజేంద్ర రాథోడ్, కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. రాజస్థాన్‌లో బీజేపీ రాజేను ముఖ్యమంత్రిగా ప్రకటిస్తుందా లేదా అనే ఊహాగానాలు చాలా వరకు ఉన్నాయి. బీజేపీ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ పథకాన్ని ఆపబోమని మోదీ హామీ ఇవ్వాలని గహ్లోత్ డిమాండ్‌పై మోదీ మాట్లాడుతూ 'కాంగ్రెస్ ప్రభుత్వం కౌంట్‌డౌన్ ప్రారంభమైందని గెహ్లాత్‌కు తెలుసు. పథకాలను ఆపవద్దని బహిరంగంగా అభ్యర్థించడం ద్వారా ఆయన ఒక విధంగా బీజేపీని అభినందించారు. ప్రజా ప్రయోజనాల కోసం బీజేపీ ఏ పథకాన్ని ఆపదని, దాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నిస్తుందని నేను మీకు హామీ ఇస్తున్నాను. ఇది మోదీ హామీ' అని తెలిపారు. అవినీతి, మహిళల భద్రత సమస్యలపై గహ్లోత్ ప్రభుత్వంపై దాడి చేసిన ప్రధాని, దేశంలో ఎక్కడైనా కూతుళ్లపై అఘాయిత్యాలు జరిగినప్పుడు తాను బాధపడ్డానని, అయితే ఇక్కడ కాంగ్రెస్ దీన్ని సంప్రదాయంగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో పేపరు లీక్ మాఫియాను కఠినంగా శిక్షిస్తామని మోదీ అన్నారు. కాంగ్రెస్ సృష్టించిన 'అభివృద్ధి నిరోధక' వాతావరణం కారణంగా రాజస్థాన్‌లో ఏ పండుగనూ శాంతియుతంగా జరుపుకోవడం సాధ్యం కాదని ప్రధాని అన్నారు. మహిళల భద్రతతో పాటు రాష్ట్రంలో శ్రేయస్సు, ఉపాధి, అభివృద్ధిని బీజేపీ తీసుకువస్తుందని మోదీ అన్నారు.

మహిళా జర్నలిస్ట్‌పై బీజేపీ నేత అభ్యంతరకర వ్యాఖ్యలు

చెన్నై: మహిళా జర్నలిస్టుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ తమిళనాడు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. తనను ప్రశ్నించిన ఒక మహిళా జర్నలిస్టు పట్ల ఆయన ప్రవర్తించిన తీరు వివాదాస్పదంగా మారింది. దీంతో ప్రతిపక్ష నేతలతో పాటు జర్నలిస్టులు ఆయన తీరును తప్పుపట్టారు. 'మీరు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కాకపోతే పార్టీలోనే కొనసాగేవారా?' అని ఓ మహిళా విలేకరి ప్రశ్నించగా అన్నామలై తీవ్రంగా స్పందించారు. "ఈ ప్రశ్న అడిగిన వారెవరో వచ్చి నా పక్కన నిలబడండి. ఎందుకంటే ఇంత అద్భుతమైన ప్రశ్న అడిగిన వారెవరో ఎనిమిది కోట్ల మంది ప్రజలు కూడా తెలుసుకోవాలి కదా. ప్రశ్నలు అడిగేందుకు ఒక పద్ధతి ఉంటుంది" అని హితవు పలికారు. అనంతరం ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ "నేను పూర్తిగా రాజకీయ నాయకుడిని కాదు. ముందు నేను రైతును, ఆ తరువాత రాజకీయ నాయకుడిని. అనంతరమే బీజేపీతో కలిసి ఉండడం" అని అన్నారు. సరైన పద్ధతిలో ప్రశ్నలు అడగాలని ఆమెకు సూచించినట్లు అన్నామలై వివరణ ఇచ్చారు. ఆయన తీరుపై కోయంబత్తూర్ ప్రెస్ క్లబ్ ఘాటుగా స్పందించింది.

యువతిపై పోలీసుల లైంగిక వేధింపులు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్ జిల్లాలో పోలీసులు అమానుష చర్యకు పాల్పడ్డారు. త్వరలో వివాహం చేసుకోబోతున్న ఒక జంటను కొందరు పోలీసులు వేధింపులకు గురిచేశారు. సరదాగా సమయం గడిపేందుకు వెళ్లిన ఆ జంట నుంచి డబ్బు వసూలు చేయడమే కాకుండా యువతిని లైంగికంగా వేధించారు. చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం బులంద్‌షహర్‌కు చెందిన ఒక జంట ఇంకొన్ని రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కనుంది. ఈ క్రమంలోనే సరదాగా గడిపేందుకు స్థానిక పార్క్‌కు వెళ్లారు. ఇంతలో వారి వద్దకు ముగ్గురు పోలీసులు వచ్చారు. వారిని బెదిరించి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే జైలుకే అంటూ యువకుడిని బెదిరించారు. తమని వదిలేయమంటూ పోలీసుల కాళ్లు పట్టుకొని ఆ జంట వేడుకున్నా కనికరించలేదు. యువకుడి నుంచి కొంత డబ్బును బలవంతంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అవి సరిపోవని రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. అంతటితో ఆ జంటను వదిలిపెట్టలేదు.

తరచూ యువతికి ఫోన్ చేసి వేధింపులకు పాల్పడడమే కాకుండా యువతిని కలిసేందుకు ఆమె ఇంటికి కూడా వచ్చేవారు. దీంతో పోలీసుల వేధింపులు తాళలేని ఆ జంట స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడితో ఫోన్‌లో జరిపిన సంభాషణను సాక్ష్యంగా యువతి చూపింది. దీంతో ఆ ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను రాకేశ్ కుమార్, దిగంబర్ కుమార్‌గా గుర్తించారు. మూడో వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛే ప్రాణవాయువు

- జర్నలిస్టులపై దాడుల నివారణకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి
- హక్కుల రక్షణకు, సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- 'సేవ్ జర్నలిజం డే' చర్చా వేదికలో వక్తల ఉద్ఘాటన
- రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని సిద్దార్థ లా కళాశాల ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకర్ బాబు అన్నారు. పత్రికా స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, తద్వారా రాజ్యాంగ విలువలు రక్షింపబడతాయని ఆయన స్పష్టం చేశారు. 'సేవ్ జర్నలిజం డే' ను పురస్కరించుకుని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్లూజే) అధ్వర్యంలో 'రాజ్యాంగం విలువలు-ప్రజాస్వామ్యం-పత్రికాస్వేచ్ఛ' అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం యూనియన్ అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న దివాకర్ బాబు మాట్లాడుతూ పత్రికారంగం ప్రజాసమస్యలను ప్రతిబింబించినప్పుడే ప్రజలు కూడా పత్రికా రంగానికి, పాత్రికేయులకు బాసటగా నిలుస్తారని తెలిపారు. రాజ్యాంగ విలువలు పరిరక్షించబడితేనే ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛా మనగలుగుతుందని చెప్పారు. ప్రస్తుతం దేశమంతటా ప్రధాన మీడియా కార్పొరేట్ల చేతుల్లో ఉండటం పత్రికా స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలనలో పౌరుల భాగస్వామ్యం పంచుకుని క్రియాశీలంగా వ్యవహరించాలని, దానికి పత్రికారంగం ప్రాధాన్యత అవసరం అన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజలకు జీవించే హక్కు కూడా ఉండదనే వాదన వచ్చినప్పుడు జర్నలిస్టులు కీలకంగా వ్యవహరించి మానవ హక్కులను కాపాడారని గుర్తు చేశారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే రాజద్రోహం కాదని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి హింసను ప్రేరేపిస్తేనే రాజద్రోహం అవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నియామకంలో ప్రధాన మంత్రి, ఆయన అపాయింట్ చేసిన కేంద్ర మంత్రి, ప్రతిపక్ష నాయకుడు నిర్ణయం తీసుకోవాలని, వారిలో మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు ఎన్నికల కమిషన్‌ను నియమించాలని పేర్కొనటంలోనే ప్రభుత్వానికి అనుకూలమైన ఎన్నికల కమిషన్ ఏర్పడుతుందనేది స్పష్టం అవుతుందన్నారు. రాజకీయ పార్టీలకు ఎలక్ట్రోల్ బాండ్‌లు ఎవరు డోనేట్ చేస్తున్నారో గోప్యంగా ఉంచుతున్నారని చెప్పారు. ప్రజలకు విషయ పరిజ్ఞానం ఉంటే పాలకులను నిలదీస్తారని చెప్పారు. పత్రికలు నిర్భీతిగా వ్యవహరిస్తే పాలకులు కంటగింపుతో అణిచివేస్తారన్నారు. రాజ్యాంగం మౌలిక విలువలను వివరించారు. ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి.తులసీ దాసు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో భారతీయులందరూ కుల, మత, ప్రాంత, భాషా, జాతి భేదాలు లేకుండా ఒక్కటై పోరాడి బ్రిటీష్ వారిని పారద్రోలారని గుర్తు చేశారు. జాతీయోద్యంలో కూడా పత్రికా స్వేచ్ఛ కోసం పోరాటం సాగించారని చెప్పారు. ఆ సందర్భంగా జరిగిన పరిణామాలతో రాజ్యాంగం రూపకల్పనలో ఆర్టికల్ 19లో భావప్రకటనా స్వేచ్ఛను చేర్చటం జరిగిందని అన్నారు. మణిపూర్ ఘటనలో పోలీసులు నమోదు చేసిన కేసులకు సంబంధించి సుప్రీం కోర్టు జోక్యం చేసుకుందన్నారు. రాజ్యాంగంపై జరిగే దాడిని ఒక వ్యక్తిగాని, ఒక సంఘంగానీ ఎదిరించలేదన్నారు. ప్రజల ప్రయోజనాలను జర్నలిస్టులు కాపాడితే జర్నలిస్టుల కోసం ప్రజలు నిలబడతారని సూచించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ విడదీయరానిదని స్పష్టం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరిగే దాడులను నివారించటానికి కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై 25కు పైగా కేసులు నమోదయ్యాయని, ఆ కేసులన్నింటినీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను వెనక్కు తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కులను కాపాడాలని, అర్హులైన వారందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలని, కరోనా కాలంలో మృతి చెందిన జర్నలిస్టులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీయూడబ్లూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమం కోసం హామీలు తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీలో గుర్తింపు కలిగిన జర్నలిస్టు సంఘాల ప్రతినిధులను తొలగించి ప్రభుత్వానికి అనుకూలమైన వారిని నియమిస్తున్నారని తెలిపారు. ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించి ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐజేయూ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఎంపీలకు ఇచ్చిన రాజ్యాంగ పీఠికలో సెక్యులరిజం, సామ్యవాదం అనే పదాలు తొలగించి ఇచ్చారని, ఆ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పందంగా ఉన్నాయన్నారు. పాలకులు ప్రజలను మానసికంగా సిద్ధం చేసే ప్రయత్నంలో భాగంగానే అలా జరిగిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కేశవానందభారతి కేసులో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు పార్లమెంటుకు లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. జాతీయ ఉపాధి హామీలో లోపాలు ఉన్నాయని రాసినందుకు జర్నలిస్టుపై రాజద్రోహం కేసు పెట్టారని, ఆంధ్ర ప్రదేశ్‌లో ఎంపీ రఘురామకృష్ణరాజుపై కూడా రాజద్రోహం కేసు పెట్టారని గుర్తు చేశారు. ప్రజలకు హక్కులు లేవని చెప్పే స్థాయికి పాలకులు వెళ్లారని, ఈ నేపథ్యంలోనే మీడియానే వారికి అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్లూజే ఉపాధ్యక్షులు కంచల జయరాజ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, కార్యదర్శి ఆర్.వసంత్ పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు అతిథులకు స్వాగతం పలికారు. అధ్యక్షులు చావా రవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు

ఐజేయూ పిలుపును పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పత్రికా స్వేచ్ఛ అణచివేతకు పాలకులు అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలను నిరసించారు. అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో మహాత్మా గాంధీ విగ్రహాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అనంతరం గాంధీకి వినతి పత్రాలు సమర్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఆత్మకూరులో ఆరు మండలాల విలేకరులు ర్యాలీ నిర్వహించారు. కర్నూలులో నల్ల రిబ్బన్లు ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఐజేయూ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, తిరుపతిలో డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వీరాస్వామి, సుదర్శన్

విశాలాంధ్ర-హైదరాబాద్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పల్లేరు వీరాస్వామి, డాక్టరు రాపోలు సుదర్శన్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన అరసం రాష్ట్ర మూడవ మహాసభ చివరి రోజున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా ఆర్వీ రామారావ్, అధ్యక్షవర్గంగా ఏటుకూరి ప్రసాద్, ఎస్వీ సత్యనారాయణ, కందిమళ్ల ప్రతాపరెడ్డి, వేల్పుల నారాయణ, వి.వీరాచారి, కాలువ మల్లయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నిధి, బొమ్మగాని నాగభూషణం, బందారు సుజాత శేఖర్, చందనాల సుమిత్ర, గులాబీల మల్లారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కేవీఎల్, కార్యదర్శులుగా కమలారెడ్డి, పలేశ్వరం వెంకటేశ్, మద్దిలేటి, కోశాధికారిగా తిరుపాల్ ఎన్నికయ్యారు.

కాలువ మల్లయ్య అరసంలో చేరిక: ప్రముఖ కవి,నవలా రచయిత కాలువ మల్లయ్య అభ్యుదయ రచయితల సంఘం(అరసం)లో చేరు తున్నట్లు మహాసభ వేదికగా ప్రకటించారు. ఇప్పటి వరకు తన సాహిత్య ప్రయాణంలో ఏ సంఘంలోనూ తాను ప్రత్యక్షంగాపాల్గొనలేదని, స్వతంత్రం గానే ఉండాలన్న తన నిర్ణయాన్ని మార్చుకుంటూ అరసంలో చేరాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. అరసంలో చేరుతానని మల్లయ్య ప్రకటించడాన్ని అరసం అఖిల భారత అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ, కేవీఎల్ స్వాగతించారు. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో సాహిత్య ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కవులు, రచయితలు అరసంలో చేరాలని ఆహ్వానించారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్
- ప్రజానాట్య మండలిలో చేరిన మహిళా కోలాట బృందాలు

విశాలాంధ్ర-తిరుపతి: జిల్లాలో ఉన్న అన్ని రకాల కళాకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి, తిరుమల కొండ పైన ప్రదర్శనకు అనుమతి మంజూరు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. సోమవారం పుత్తూరు మండలంలో మహిళా కోలాట బృందాల అధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ర్యాలీగా వచ్చి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ భవన్‌లో కోలాట బృందం గురువు ఎన్.ముకుంద అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా చిన్నం పెంచలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజానాట్య మండలిలో నాలుగు గ్రామాలకు చెందిన మహిళా కోలాట బృందాలు చేరాయి. చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ దేశ సంస్కృతీసంప్రదాయాలకు నిలయం గ్రామీణ జానపద కళలు అని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జానపద కళలు మరుగునపడకుండా బతికిస్తూ, కళాకారులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తోందని గుర్తు చేశారు. ఆ పోరాటాల ఫలితంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం వేలాది మంది కళాకారులకు రూ.3 వేలు పెన్షన్ ఇచ్చిందని తెలిపారు. అలాగే వేలాది మంది కళాకారులూ గుర్తింపు కార్డులు, పెన్షన్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్న సమయంలో ప్రభుత్వం నూతన జీవో తీసుకురావడం హర్షించదగిన విషయమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మహిళా కోలాట బృందాల ప్రదర్శనకు అనుమతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలు తమ శ్రమను మరచిపోవడానికి కోలాటం, చెక్క భజన కళలు ఎంతో దోహదపడతాయని అన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే విధంగా కళాకారుల గుర్తింపు కార్డుల పంపిణీ కోసం దరఖాస్తులకు ఆఖరు తేదీ అక్టోబరు 6 అని చెప్పడం సరికాదని, తేదీని పొడిగించాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.నదియా మాట్లాడుతూ కోలాట బృందంలో ఉన్న వారందరూ మహిళలే అయినందున సమస్యల పరిష్కారం విషయంలో మీకు తోడుగా ఉంటామని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ మాట్లాడుతూ కళాకారులందరూ కష్టజీవులే అని, మీకు రావాల్సిన హక్కుల కోసం మీతో కలిసి పని చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పుత్తూరు మండల కార్యదర్శి మహేష్, ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జింకా నాగరాజు, సహాయ కార్యదర్శి దప్పు సూరి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి దీక్షకు సీపీఐ మద్దతు

సంఘీభావం తెలిపిన అక్కినేని వనజ, దుర్గాభవాని

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తి వేయాలని కోరుతూ గాంధీజీ జయంతి సందర్భంగా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన ఒక్క రోజు దీక్షకు సీపీఐ మద్దతు తెలిపింది. దీక్షా శిబిరానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు, మహిళా నేత రాణి, సప్ప రమణ బృందం వెళ్లి ఆమెకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఈ దీక్షను ఉద్దేశించి అక్కినేని వనజ మాట్లాడుతూ చంద్రబాబుపై పెట్టిన కేసులో ఎటువంటి ఆధారాలు లేవని, అరెస్ట్ చేసిన విధానం ప్రజాస్వామ్యయుతంగా లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఉద్యమకారులపై అక్రమ అరెస్టులు, నిర్బంధాలు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. అరాచక పాలన సాగుతోం దన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసును ప్రజాస్వామిక వాదులు అందరూ ఖండించాలని కోరారు. పి.దుర్గాభవాని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా లోకం నారా భువనేశ్వరికి అండగా ఉంటుందన్నారు.

విచారణ పేరుతో దళిత యువకుడి కాలు విరగ్గొట్టారు

విశాఖ జిల్లా పద్మనాభపురం పోలీసుల దాష్టీకం

బంధువుల ఆందోళన... ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన సీపీ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలో పోలీసుల దాష్టీకాలు పెరిగిపోతున్నాయి. కోడి దొంగతనం కేసులో ఓ దళిత యువకుడిని కాలు విరిగేలా చితక్కొట్టి న ఘటనపై బాధితుడి బంధువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే... విశాఖ జిల్లా పద్మనాభం క్రైం పోలీసులు రెచ్చిపోయారు. కోడిని దొంగతనం చేశారనే అభియోగంపై భీమిలి పద్మనాభం మండలం బాందేవపురం గ్రామానికి చెందిన దళిత యువకుడు పాపు (24)ను స్టేషన్‌కు తీసుకువచ్చి నేరం ఒప్పుకోవాలంటూ చావబాదారు. బాధితుడి కాలి ఎముక విరిగిపోవడంతో 108 వాహనంలో కుటుంబీకులు చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబీకులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. నగర్ పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు సమాచారం తెలియడంతో వెంటనే క్రైం డీసీపీ నాగన్నను స్టేషన్‌కు పంపించారు. పోలీసు సిబ్బందిపై డీసీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. థర్డ్ డిగ్రీ ఉపయోగించడంపై మండిపడి దిశ డీఎస్పీ వివేకానంద అధ్వర్యంలో దర్యాప్తునకు ఆదేశించారు. న్యాయం జరగుతుందని డీసీపీ హామీ ఇవ్వడంతో క్షతగాత్రుడి కుటుంబీకులు ఆందోళన విరమించారు. స్టేషన్‌లో యువకుడ్ని చావబాదినందుకు ఎస్ఐ ఆర్.మళ్లేశ్వరరావు, క్రైం కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరావు (పీసీ 3143), కె.సతీష్ (పీసీ 3367)లపై పద్మనాభం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యర్ ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. దొంగతనం కేసులో విచారణ పేరుతో ఓ దళిత యువకుడ్ని కాలు విరగగొట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని.. ఇందుకు బాధ్యులైన క్రైమ్ ఎస్ఐ మల్లేశ్వరరావు, కానిస్టేబుల్ కే శ్రీనివాసరావు, కే సతీష్ లను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. వీరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేసినట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని... విచారణ పేరుతో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని, విధులు నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని ఈ సందర్భంగా సీపీ పోలీస్ సిబ్బందిని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టీపుల్ చేజ్‌లో మూడు పతకాలు

స్వర్ణం సాధించి రికార్డు నెలకొల్పిన అవినాష్

హాన్జౌ: చైనాలోని హాంగ్జౌ వేదికగా జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో భారత్‌కు పతకాల జోరు కొనసాగుతూనే ఉంది. సోమవారం 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ విభాగంలో భారత్‌కు మూడు పతకాలు దక్కాయి. మహిళల టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం దక్కింది. పురుషుల 3000 మీటర్స్ స్టీపుల్ చేజ్‌లో అవినాష్ సాబిల్ బంగారు పతకం సాధించి చరిత్ర సృష్టించాడు. ఎందుకంటే పురుషుల 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ విభాగంలో భారత్ తరఫున బంగారు పతకం నెగ్గిన తొలి వ్యక్తిగా అవినాష్ రికార్డుల్లోకి ఎక్కాడు. అవినాష్ 8 నిమిషాల 19.50 సెకన్‌లలో రేసు పూర్తి చేసి 2018 ఆసియా క్రీడల్లో ఇరాన్‌కు చెందిన హుస్సేన్ కిహాని నమోదు చేసిన 8 నిమిషాల 22.79 సెకన్ల రికార్డును బద్దలు కొట్టాడు. కాగా, మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ ఈవెంట్‌లో 13 ఏళ్ల క్రితం జరిగిన 2010 ఆసియా క్రీడల్లో సుధా సింగ్ బంగారు పతకం సాధించగా... ఆ తర్వాత ఈ విభాగంలో ఇదే తొలి బంగారు పతకం. మరో వైపు మహిళల 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ ఈవెంట్‌లో బంగారు పతకం చేజారిపోయింది కానీ రజత, కాంస్య పతకాలు భారత్‌కే దక్కాయి. బహ్రెయిన్‌కు చెందిన విన్‌ఫ్రెడ్ యావి 9 నిమిషాల 18.28 సెకన్లలో రేసును పూర్తి చేసి పసిడి పతకాన్ని ఎగరేసుకు పోగా... భారత్‌కు చెందిన పారుల్ చౌదరి 9 నిమిషాల 27.63 సెకన్ల టైమింగ్‌తో రజతం, భారత్‌కే చెందిన ప్రీతి 9 నిమిషాల 43.22 సెకన్ల టైమింగ్‌తో కాంస్య పతకం దక్కించుకున్నారు. మహిళల టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో సుతీర్థ ముఖర్జి, ఐహిక ముఖర్జీతో కూడిన భారత జోడీ కాంస్య పతకం సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్‌లో భారత్‌కు కాంస్య పతకం రావడం ఇదే తొలిసారి. సెమీఫైనల్‌లో ఈ జోడీ ఉత్తర కొరియాకు చెందిన చా సుయోంగ్, పాక్ సుగ్యోంగ్ జోడి చేతిలో భారత్ పరాజయం పాలై కాంస్యంతో సరిపెట్టుకుంది.

హాకీ సెమీ ఫైనల్స్‌లో భారత్: ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు జైత్రయాత్ర కొనసాగుతున్నది. పూల్-ఏ లో జరిగిన అన్ని లీగ్ మ్యాచ్‌లలో భారత జట్టు భారీ గోల్స్ తేడాతో ఘన విజయాలు నమోదు చేసింది. సోమవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కూడా బంగ్లాదేశ్‌పై 12-0 తేడాతో భారత్ ఏకపక్ష విజయం సాధించింది. దాంతో పూల్-ఏలో అగ్రస్థానంలో నిలిచి... నేరుగా సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. సెమీస్‌లో గెలిస్తే భారత్‌కు రజత పతకం ఖాయం కానుంది. ఫైనల్‌లోనూ విజయం సాధిస్తే హాకీ బంగారు పతకం అందుకుంటుంది. కాగా, పూల్-ఏ లో ఇప్పటి వరకు జరిగిన ఐదు లీగ్ మ్యాచ్‌లలో భారత్ ఏకంగా 58 గోల్స్ సాధించింది. దాంతో ఇప్పవరకు భారత్ ఖాతాలో ఈ ఏషియాడ్ పతకాల సంఖ్య 55కు చేరింది. అందులో 14 స్వర్ణాలు, 21 రజతాలు, 20 కాంస్య పతకాలు ఉన్నాయి.

పేరుమోసిన ఉగ్రవాది షఫీ ఉజామా అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక విజయం సాధించింది. పేరుమోసిన ఉగ్రవాది మహమ్మద్ షానవాజ్ అలియాస్ షఫీ ఉజామాను అరెస్టు చేసింది. ఆ ఉగ్రవాది వివరాలు వెల్లడించిన వారికి రూ.3 లక్షల రివార్డును కూడా ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. కొన్నాళ్ల క్రితం ఢిల్లీ మాడ్యుల్ ఐఎస్ఐఎస్ ఉగ్రవాదిని అరెస్టు చేసి రాబట్టిన సమాచారం ఆధారంగా షానవాజ్‌ను పట్టుకున్నారు. ఢిల్లీలో ఉగ్రదాడులకు షానవాజ్ పన్నాగం పన్నినట్లు ఎన్ఐఏ అధికారులు చెబుతున్నారు. వృత్తిరీత్యా ఇంజినీర్ అయిన షానవాజ్ పుణే ఐసిస్ మాడ్యుల్ కేసులో కీలక నిందితుడు. పూణే పోలీస్ కస్టడీ నుంచి తప్పించుకొని వచ్చి ఢిల్లీలో ఉంటున్నాడు. ఇప్పటికే ఐసిస్ అనుమానితులుగా అరెస్టు చేసిన ఇద్దరు వ్యక్తులతో కలిసి షానవాజ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ఆ ఉగ్రవాది వద్ద నుంచి ఐఈడీలను తయారు చేయడానికి ఉపయోగించే వివిధ రసాయనాలను స్వాధీనం చేసుకొన్నారు. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు, ఎన్ఐఏ అధికారులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఆగస్టులో థాణె జిల్లాలో షమిల్ షకీబ్ నాచాన్ అనే ఉగ్రవాదిని అరెస్టు చేసి పేలుడు పదార్థాలకు ఉపయోగించే మెటీరియల్‌ను స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా వీరితోపాటు మరికొందరు కూడా ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకొంది. వీరంతా ఐఈడీలను వాడి 26/11 పేలుళ్ల కంటే పెద్ద దాడిని దేశంలో చేయాలని కుట్ర పన్నుతున్నట్లు అధికారులు చెప్పారు. ఇప్పటికే నాచాన్, పూణేలో బాంబుల తయారీపై ఒక వర్క్‌షాప్ నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఎన్ఐఏ బృందాలు ఐఎస్ఐఎస్ పూణే మాడ్యుల్‌లోని వ్యక్తులను అరెస్టు చేయడం కోసం ప్రత్యేక గాలింపు బృందాలను ఏర్పాటు చేశాయి

జనసేనతోనే రాష్ట్ర భవిష్యత్తు: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మచిలీపట్నం: కుల సమీకరణాల గురించి ఆలోచిస్తే ఎప్పటికీ రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని... జనసేన భావజాలమే త్వరలో దేశమంతా వ్యాపిస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వారాహి యాత్రలో భాగంగా సోమవారం మచిలీపట్నంలో పవన్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సువర్ణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... "కులాల ఐక్యత గురించి నేను పదే పదే చెబుతాను... ఏ ఒక్క కులం వల్లో అధికారం రాదని మనందరం గుర్తించాలి... కాపు కులంలో పుట్టినా నేను అన్నింటినీ సమదృష్టితో చూసే వ్యక్తిని. నేను కులాలను వెదుక్కొని స్నేహాలు చేయను. వైకాపా కీలక పదవులన్నీ ఒక కులంతో నింపేస్తే ఈ రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుంది" అని ఆయన అన్నారు. కాపులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు... కాపులు పెద్దన్న పాత్ర పోషించాలి. ఒక కులానికి మరో కులం పట్ల ఎందుకు ద్వేషం ఉండాలని ప్రశ్నించారు. సామాజిక వెనుకబాటును ఎలా రూపుమాపాలో ఆలోచించాలన్నారు. నాలుగు ఎన్నికల్లో కష్టపడితే టీఎస్పీ అధికారంలోకి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. లేచిందే లేడికి పరుగు అన్నట్లు పార్టీ పెట్టగానే అధికారం రాదని, మనం అధికారంలోకి రావాలంటే అందరం కలిసికట్టుగా శ్రమించాలని సూచించారు. 1983లో నందమూరి తారక రామారావు పార్టీ పెట్టగానే ఆయన అధికారం చేజిక్కించుకున్నారని, ఆనాడు రాష్ట్రంలో పరిస్థితి వేరని అటువంటి పరిస్థితి నేడు ఆంధ్ర రాష్ట్రంలో లేదని ఆయన తెలిపారు. జనసేన పార్టీని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జనసేనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉందని... ఇది ప్రాంతీయ పార్టీ కాదని ముమ్ముందు జనసేన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, నాయకులు బండి రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి నారాయణకు సీఐడీ మరోసారి నోటీసులు

4న లోకేశ్‌తో పాటు విచారణకు హాజరుకావాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో మాజీ మంత్రి నారాయణకు సీఐడీ మరోసారి నోటీసులు ఇచ్చింది. ఈనెల 4న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో పాటు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో ఏ-2గా ఉన్న నారాయణకు హైకోర్టు గతంలో మధ్యంతర బెయిల్ ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ విచారణ పేరుతో సీఐడీ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై నారాయణ స్పందించారు. 'సీఐడీ నోటీసుల ప్రకారం ఈనెల 4న విచారణకు హాజరవుతాను. వివరాలన్నీ అధికారులకు వెల్లడిస్తాను. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉండటంతో అంతకుమించి దీనిపై స్పందించనని నారాయణ తెలిపారు. ఇక ఈ కేసులోనూ చంద్రబాబుని ఏ-1గా చేరుస్తూ సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై చంద్రబాబు కూడా ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు.

6-10 తరగతులకు నేటి నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు

10లోగా మూల్యాంకనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ)-2 పరీక్షలు మంగళవారం (3వతేదీ) ప్రారంభం కానున్నాయి. ఈనెల 6 అంటే శుక్రవారం వరకు పరీక్షలు జరుగుతాయి. ఉన్నత పాఠశాలలో నిర్దేశించిన సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి ప్రశ్నాపత్రాలు ఉంటుంది. పరీక్షకు గంట ముందు ప్రశ్నాపత్రాలను ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు అందజేస్తారు. ఈ మేరకు ఆదేశాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే జారీ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తారు. 9, 10 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం జరుగుతాయి. ఈనెల10వ తేదీలోగా సమాధానపత్రాల మూల్యాంకనం పూర్తి అవుతుంది. ఆన్‌లైన్ పోర్టల్‌లో అవసరమైన మార్పులు నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. 10వ తేదీన తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల మార్కుల వివరాలను తెలియజేస్తారు.

14 నుంచి దసరా సెలవులు: ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు దసరా సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 25న పాఠశాలలను పునఃప్రారంభిస్తారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.